# తాయుమానవర్

(17వ శతాబ్దపు తమిళ - శివభక్తకవి, యోగి)

రచన

**డా॥ గాలి గుణశేఖర్**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2022**

# THAYUMAANAVAR

By
**Dr. Gali Gunasekhar**

T.T.D. Religious Publications Series No. 1427
@ All Rights Reserved

First Edition : 2022

Copies : 500

Price :

Published by :
**Sri A.V. Dharma Reddy,** I.D.E.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

**D.T.P.**
Publications Division,
T.T.D, Tirupati

Printed at
**Tirumala Tirupati Devasthanam's Press**
Tirupati - 517 507

## ముందుమాట

భారతదేశంలో అనాదిగా ఆ యా కాలాల్లో, ఆ యా కులాల్లో, ఆ యా ప్రాంతాల్లో అవతరించిన మహనీయులు ఎందరో మనకు దర్శనమిస్తారు. ఆ మహాపురుషులు అందరు వారి వారి కాలాల్లోని వివిధ పరిస్థితుల్లో కేవలం మనుగడ సాగించడం మాత్రమేగాక మానవోద్ధరణకు కృషి చేశారు. తద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యంతోపాటు ఆధ్యాత్మిక వికాసానికి కూడా ఆ మహామనీషులు ఎంతగానో తోడ్పడ్డారు.

అలాంటి మహాత్ముల జీవితగాథలను, వారు ప్రబోధించిన జీవన సత్యాలను, ఆధ్యాత్మిక సందేశాలను భక్తులకు అందించాలన్న తలంపుతో తిరుమల తిరుపతి దేవస్థానం **"బ్రహ్మ మొక్కటే"** అనే శీర్షిక క్రింద ఒక గ్రంథమాలను ప్రారంభించింది. అందు కనుగుణంగా కొందరు పండితులచేత అలాంటి మహాపురుషుల జీవనరేఖను చిత్రించే గ్రంథాలను రాయించి ప్రచురించాలని సంకల్పించింది.

అందులో భాగంగా ప్రస్తుతం డా॥ గాలి గుణశేఖర్‌గారు రచించిన **"తాయుమానవర్"** అన్న పుస్తకాన్ని అందజేస్తున్నాము. తమిళభాషా సాహిత్యాలకు భక్తకవులు ఎనలేని సేవలందించారు. అటువంటి మహాత్ముల సరసన నిలువదగినవారు శ్రీతాయుమానవర్. ఈయన ప్రదర్శించిన శివభక్తి అనన్యసామాన్యం. ఈ గ్రంథ పఠనం ద్వారా, పిల్లలు, పెద్దలు ఆధ్యాత్మిక చైతన్యవంతులు కావాలని ఆకాంక్షిస్తూ...

సదా శ్రీవారి సేవలో...

**శ్రీకార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.



## ప్రవేశిక

తమిళంలో భక్తిసాహిత్యం శాఖోపశాఖలుగా విస్తరించింది. 12మంది ఆళ్వార్లు, 63 మంది నాయనార్లు భక్తిసాహిత్యాన్ని పరిపుష్టం గావించారు. నాలాయిర దివ్యప్రబంధం విష్ణువును పరబ్రహ్మగా కీర్తించింది. 12 తిరుముఱైగళ్ శివుని పరబ్రహ్మగా స్తుతించాయి. ఇవి 27 మంది భక్త కవులచేత రచింపబడిన 18,280 పాటలున్న 12 సంకలన గ్రంథాలు. వీరేకాక మరెందరో భక్తకవులు తమిళభాషా సాహిత్యాలకు ఎనలేని సేవలందించారు. అటువంటి మహాత్ముల సరసన నిలువదగినవారు శ్రీతాయుమానవర్. ఈయన ప్రదర్శించిన శివభక్తి అనన్యసామాన్యం. వీరిని గురించి ఒక కథ ప్రచారంలో ఉంది.

తాయుమానవర్ సమకాలికుడైన నాయకరాజు విజయరంగ చొక్కనాథ నాయకుడు ఆయనకో ఖరీదైన శాలువను బహూకరించాడు. దానినతడు తీసుకొని ఇంటికి వెళ్తుండగా దారిలో ఒక దళితస్త్రీ చలికి వణుకుతూ కన్పించింది. తనకంటె శాలువా అవసరం ఆమెకే ఉందని భావించి దానిని ఆమెకు ఇచ్చాడు. వేగులద్వారా ఈ విషయం రాజుకు తెలిసింది. ఆ తర్వాత ఆయన తాయుమానవర్‌ను శాలువను ఎవరికిచ్చారని గద్దించి అడిగాడు. అందుకు తాయుమానవర్ "నా తల్లి అఖిలాండేశ్వరి దేవికి ఇచ్చాను" అని ప్రశాంతంగా సమాధానం ఇచ్చారని జనశ్రుతి.

పై సంఘటన ఆయన పారమార్థిక దృష్టిని తెలియజేస్తుంది. సర్వభూతదయను పరమాశయంగా భావించి జీవితాన్ని గడిపినవారు తాయుమానవ స్వామి. అఖండాకార శివుని మానవాళి ఆరాధించే మార్గాన్ని నిర్దేశిస్తూ భక్తిగీతాలను ఆయన రచించారు. తదనుగుణంగా జీవించారు.

**అఖిల జనులు సంతసిల్లుట కంటె**
**అన్యమేదియు నెఱుగజాలను పరాత్పరా!**

తెలుగులో ఈయనపై ఒక లఘురచన చేయించి భక్తజనులకు అందజేయాలని, తిరుమల తిరుపతి దేవస్థాన నిర్వాహణాధికారులు నిర్ణయించారు. ప్రచురణ విభాగం ఆ పనిని నాకు అప్పగించింది.

తాయుమానవర్ గురించి అప్పటికి నాకు తెలిసిన విషయం అతి స్వల్పం. ఈ రచన కారణంగా ఆయన రచించిన గీతాలన్నిటినీ అధ్యయనం చెయ్యడంతోబాటు తమిళ సాహిత్య పరిశోధకుల గ్రంథాలను చదివాను. తత్ఫలితమే ఈ సంగ్రహరచన. ఈ గ్రంథంలో తమిళపదాలను ఉచ్చారణానుసారిగా రాశాను.

నాచేత ఈ పవిత్ర కార్యాన్ని చేయించిన తిరుమల తిరుపతి దేవస్థాన అధికారవర్గానికి హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు.

బుధ జన విధేయుడు

**గాలి గుణశేఖర్**

## ఇందులో...


| | | |
|---|---|---|
| | ప్రవేశిక | |
| 1. | సంసార జీవితం | 01 |
| 2. | సద్గురు దర్శనం | 08 |
| 3. | సన్న్యాస జీవితం | 13 |
| 4. | రచనా వైశిష్ట్యం | 25 |
| 5. | పరమాత్మభావన | 42 |
| 6. | ఆత్మచింతన | 49 |
| 7. | మనోధర్మాలు | 53 |
| 8. | కర్మప్రభావం | 64 |
| 9. | పవిత్రాద్వైతం | 68 |
| 10. | ఆరాధనా పద్ధతులు | 72 |

# 1. సంసార జీవితం

**ఆచారః పరమోధర్మః ఆచారః పరమతపః ।**
**ఆచారః పరమజ్ఞానం ఆచారాత్ కిం న సాధ్యతే ॥**

సత్ప్రవర్తనకు ఆచారమని పేరు. ఆచారమే గొప్పధర్మం. ఆచారమే గొప్పతపస్సు. ఆచారం గొప్పజ్ఞానానికి మూలం. ఆచారంవల్ల సాధింపలేనిది లేదు.

**జననం - తల్లిదండ్రులు**

శివభక్తి గీతాలైన 'తేవారం' పాటలు పెక్కింటిలో కీర్తింపబడిన ప్రసిద్ధ శివక్షేత్రం తిరుముఱైక్కాడు. దీని సంస్కృతీకరణ నామం వేదారణ్యం. నేడు ఈ పేరుతోనే ప్రముఖంగా వ్యవహరింపబడుతూంది. వ్యవసాయం ప్రధాన వృత్తిగా గల శైవవేళాళర్ కులంలో జన్మించిన కేడిలియప్పర్ అనే శివభక్తుడు ఆ గ్రామంలో నివసించేవాడు. కేడిలి అంటే నాశనంలేనిది అని అర్థం. చేటుకానిది అని కూడా అర్థం. కేడిలియప్పర్ అక్షయుడైన శివపరమాత్మనూ సూచిస్తుంది. అతడికున్న శివభక్తిని, శైవసిద్ధాంత సంప్రదాయంలో ఉన్న ప్రవేశాన్ని, నిర్వహణా సామర్థ్యాన్ని చూసిన ఊరి ప్రజలు శివాలయ నిర్వహణ బాధ్యతను ఆయనకు అప్పగించారు. ఆయన ఆ బాధ్యతను త్రికరణశుద్ధితో నిర్వర్తించేవాడు. ఆయన భార్యపేరు గజవల్లియమ్మ. ఆయనకో అగ్రసోదరుడు ఉండేవాడు. అతడిపేరు వేదారణ్యం పిళ్లై.

కేడిలియప్పర్ దంపతులకు శివకృపచేత ఒక మగబిడ్డ పుట్టాడు. ఆ శిశువుకు శివచిదంబరం అనే పేరు పెట్టారు. వేదారణ్యం పిళ్లై మగసంతానం లేదని వగచేవాడు. శివచిదంబరం మీద అమితమైన వాత్సల్యాన్ని చూపేవాడు. తనకప్పటికి ఏకైక సంతానం అయినా శివచిదంబరాన్ని దత్తతకిచ్చాడు కేడిలియప్పర్.

చోళ, పాండ్యదేశ ప్రాంతాలను విజయనగర రాజప్రతినిధులుగా నాయకరాజులు పాలిస్తున్న (1559-1736) రోజులవి. నాయక రాజులలో ఎనిమిదో తరానికి చెందిన ముద్దుకృష్ణప్ప నాయకుడు (1602-1608) తిరుచ్చిరాపళ్ళి కేంద్రంగా పరిపాలన చేస్తున్నాడు. అతడొక పర్యాయం వేదారణ్యం ఆలయ దర్శనానికి, సముద్రస్నానానికి వచ్చాడు. కేడిలియప్పర్ ఆలయమర్యాదలతో స్వాగతం పలికి, తేవారగ్రంథ వైశిష్ట్యాన్ని తెలియజేస్తూ దైవదర్శనం చేయించాడు. కేడిలియప్పర్ కనబరచిన భక్తిశ్రద్ధలు, శైవసిద్ధాంత జ్ఞానం, లెక్కలలో ఆయనకున్న ప్రతిభను గుర్తించిన రాజు ఆయనను ప్రభుత్వ ప్రధాన సంప్రతి (గణకుడు, కరణం)గా తిరుచ్చిరాపళ్ళికి ఆహ్వానించాడు. రాజాజ్ఞ కనుక వేదారణ్యం శివాలయానికి తగిన ప్రతినిధిని నియమించి కేడిలియప్పర్ సతీసమేతంగా తిరుచ్చిరాపళ్ళికి చేరుకున్నాడు.

తిరుచ్చి మలైక్కోట్టై (పర్వతదుర్గం, రాక్‌ఫోర్ట్)లో కొలువున్న పరమశివుని పేరు తాయుమానవర్. తాయుమానవర్ అంటే 'తల్లియునైనవాడు' అని అర్థం. పితృభావనతోనే కాక మాతృభావనతోను దయచూపే స్వామి ఆయన. ఆ పేరు స్వామికి ప్రసిద్ధం కావడానికి ప్రాచీనకాలం నుంచి ప్రచారంలో ఉన్న కథ ఒకటి కారణం.

పూర్వం కావేరీనదీ తీరానికి ఒకవైపు రత్నావతి అనే శెట్టికుమార్తె కాపురం ఉండేది. నదికి మరోవైపు ఆమె తల్లిదండ్రులు నివసించేవారు. కుమార్తెకు కాన్పు సమయం. ఆమె తల్లిరాకకోసం ఎదరుచూస్తూ ఉంది. తల్లికూడా కుమార్తెకు సాయంగా ఉండాలని పయనమయ్యింది. కాని కావేరీనది ఉద్ధృతంగా ప్రవహిస్తూ ఉంది. దాటడం అసాధ్యం. కుమార్తెకు నొప్పులు ఎక్కువయ్యాయి. పరమశివుని ప్రార్థిస్తూ ఉంది. ఇంతలో తల్లి వచ్చింది. తగిన శుశ్రూష వల్ల కుమార్తె సుఖంగా ప్రసవించింది. అప్పుడు తనకున్న ఆనందంలో తల్లి ఎలా రాగలిగింది అని కుమార్తె ప్రశ్నించలేదు. నదీప్రవాహం తగ్గుముఖం పట్టింది. తల్లి హఠాత్తుగా అదృశ్యమయ్యింది. ఆశ్చర్యానికి లోనయింది కుమార్తె.

మరికొంతసేపటికి తల్లి అక్కడికి చేరుకొని కుమార్తెకు సుఖప్రసవం కావడం గమనించి పరమశివునికి కృతజ్ఞతలు తెలిపింది. కుమార్తె అప్రతిభురాలై అప్పటివరకు జరిగిన విషయాలను చెప్పింది. ఇద్దరూ దిగ్భ్రమకులోనై ఇది పరమేశ్వరుని చర్యేనని గ్రహించారు. ఈ సంఘటనతో మలైక్కోట్టైస్వామికి తాయుమానవ స్వామి అనే పేరు స్థిరపడింది.

తిరుచ్చిరాపళ్ళికి వచ్చినప్పటినుంచి కేడిలియప్పర్ దంపతులు ప్రతిరోజు తాయుమానవ స్వామిని దర్శించి ప్రార్థించేవారు. తమకో సంతానం కావాలని అర్థించేవారు. ఆ ప్రార్థన ఫలించి గజవల్లియమ్మ మగసంతానాన్ని ప్రసవించింది. ఇది స్వామి కృపేనని భావించి దంపతులు ఆ శిశువుకు స్వామిపేరే పెట్టారు. పువ్వు పుట్టగానే పరిమళించినట్లు ఆ శిశువులో తల్లిదండ్రుల భక్తిలక్షణాలు పొడసూపసాగాయి.

**విద్యార్జన**

తాయుమానవర్ శుక్లపక్షచంద్రునిలా దినదిన ప్రవర్ధమానుడవుతున్నాడు. పాలకుల ఆదరణ ఉన్నందున రాజబంధువులకు సాధ్యమయ్యే ఉన్నతవిద్య అతడికి లభ్యమయింది.

**విద్యనొక జన్మగరచిన వెలయుఫలము**
**జన్మలేడింటి యందును సాగుచుండు (తిరుక్కుఱళ్-శ్రీవాణి-398)**

పూర్వజన్మవాసనల చేత తమిళ సంస్కృత లక్ష్యలక్షణ గ్రంథాల అధ్యయనం చిరుప్రాయంలోనే మొదలయింది. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు క్షుణ్ణంగా చదివాడు. తమిళంలోని తేవారం, తిరువాచగం వంటి శైవగ్రంథాలను, తిరుమూలర్, అరుణగిరినాథర్ రచించిన యోగ, భక్తిసాహిత్యాన్ని సమగ్రంగా అధ్యయనం చేశాడు. మెయ్‌కణ్డశాస్త్రమని ప్రసిద్ధిగాంచిన పద్నాలుగు శైవసిద్ధాంత గ్రంథాలను పారాయణం చేసేవాడు. చదువులలోని మర్మాలను అర్థం చేసుకున్నాడు.

**చదివిన ఫలమేమి? సర్వజ్ఞు శుభపద**
**ముల నెపుడెద నిలిపి కొలువకున్న - తిరుక్కుఱళ్ (శ్రీవాణి) - 2**

చదివినందుకు ఫలితం సర్వజ్ఞుని చరణారవిందాలను ఆశ్రయించి కొలవడమేనని తెలుసుకున్నాడు. ప్రతిరోజు ఆలయ ఆరాధన కార్యక్రమాలలో పాల్గొని శివపూజాపద్ధతిని గ్రహించాడు. మతసంబంధమైన జ్ఞానం తండ్రిద్వారా సంక్రమించింది. నాయకరాజులు తెలుగువారు కనుక ఆ భాషతోబాటు, ప్రభుత్వోద్యోగం చెయ్యడంవల్ల మరికొన్ని భాషలతోను ఆయనకు పరిచయం ఏర్పడింది. ఉపన్యాస ప్రతిభతోబాటు కవిత్వరచనాసక్తి (శక్తి) కలిగింది. కేవలం అధ్యయనంతో ప్రయోజనం లేదని, సిద్ధాంతాలను పాటించి స్వానుభూతి పొందడమే లక్ష్యంగా ఉండాలని ఆయన అభిప్రాయం.

**మాటలుడిగి నిర్వికల్పసమాధి**
**సుఖమనుభవించు వారె భవ్యులు**
**శాస్త్ర గ్రంథమందలి నుడుల**
**ననుసరింపకున్న చదివిన ఫలమేమి? - కాంతాకనకాలు-36**

అని ప్రశ్నించాడు.

**సతతము నీదుకృపకు నుతించుటె కాని**
**ఇతరమెఱుగ నిక నీ చిత్తము పరాత్పరా! - 255**

**మన్నుతోడ మిన్ను చూపి వ్యక్తా వ్యక్తమైతోచు**
**అనుగ్రహమును చర్మచక్షుల గాంచుటెన్నడో పరాత్పరా - 82**

పై తాయుమానవర్ గీతాలద్వారా దైవానుగ్రహానికై తపించి, ఎల్లప్పుడూ దైవనామస్మరణతోనే జీవితాన్ని గడిపినట్లు స్పష్టమవుతుంది. పాఠశాల విద్యను బోధించిన ప్రధానాచార్యులు నాడు సుప్రసిద్ధులైన, ఉభయకళానిధి బిరుదాంకితులు చిత్రంబళదేశిగర్.

**ఉద్యోగ జీవితం**

కేడిలియప్ప పిళ్ళై ఉద్యోగంలో చేరిన తర్వాత నాయకరాజులైన ముద్దుకృష్ణప్పనాయకుడు, ఆయన కుమారుడు ముద్దువీరప్పనాయకుడు దివంగతులయ్యారు. ముద్దువీరప్పనాయకుడి కుమారుడైన విజయరంగ చొక్కనాథనాయకుడు రాజ్యమేలుతున్న కాలంలోనే కేడిలియప్పర్ పరమ పదించాడు. రాజు తాయుమానవర్‌ను ఆహ్వానించి, ఆయన ప్రతిభను గ్రహించినవాడు కనుక తండ్రి బాధ్యతను తనయుడికి అప్పజెప్పాడు.

ప్రాపంచిక జీవితంలో తనకు అప్పగించిన పనిని ప్రతిభావంతంగా నిర్వహిస్తున్నా, నశ్వరమైన జీవితానుభవాల మీద ఆయనకు విరక్తి కలుగుతూ ఉండేది. శివానుభూతికై నిరంతరం తపించేవాడు. అది ఎప్పటికి తనకు కలుగుతుందోనని వెతకు లోనయ్యేవాడు.

**మోహాదుల సృజించు పాశమును నిరసించి**
**నిన్ను, నన్ను పరిపూర్ణముగ నెఱిగి**
**సంతసపు సెలయేటిలో మునుకలిడవలె, అదిగాక**
**దేహము నను వీడ, నేనద్దానిని విడిచి**
**ఉజ్జీవించు గతి నాకున్నదో... – జ్ఞాన సుఖోదయలీల – 5**

నిన్ను నన్ను అంటే పరమాత్మణ్ని, దాసుడైన తనకు అని అర్థం. ఆశించిన లక్ష్యం నెరవేరక గతించినట్లయితే సద్గతి పొందే అవకాశం ఏది? అని ప్రశ్నించాడు.

**పంచభూతములతోనైన కాయమిదియని**
**ఎఱుగనంత దనుక భోజ్యభోగాదులె**
**జీవితమని యెంచితి; నిన్నెఱిగి నంతనె**
**నీచ భావములు పరుగులిడియె, జననమరణ**
**చక్రమును దలప నిపుడు ఎద గుబిల్లుమను,**

**నిదురచెడు, అగ్నిశిఖలోన కరుగు**
**కొవ్వొత్తి భంగి రాత్రింబవళ్ళు మేను**
**దహించ సాగె, ఈ యవస్థలు నాకేలనో?– చిన్మయానంద గురువు – 5**

జననమరణ చక్రమనే సంసార సాగరంలో మునగడమే జీవితమని తలపు రాగానే భయం, అభద్రత మొదలైన లక్షణాలు పొడచూపుతున్నాయి. కనుక ఆచార్యులు ఎవరు తారసపడినా తాత్త్వికాంశాల సంశయనివృత్తికోసం చర్చించేవాడు. వినయంగా ప్రశ్నించేవాడు.

**దాహమెతిగి నిష్ఠవారి గ్రోలనందున పతనమైతిని;**
**దేహమంతమైన ముక్తిసాధన చేయు మార్గమేది – పరాత్పరా – 24**

తనకు కలిగిన మోక్షదాహాన్ని నిష్ఠజలంచేత తీర్చుకోకపోతే పతనం చెందుతాడు. కనుక ఈ కాయం నశించినట్లయితే నాగతి ఏమిటి? అని సంశయాన్ని ప్రకటించాడు.

**నను చూడరాదొ! చూచి ఆర్తి తీర్చరాదొ?**
**నోరు తెరచి నుడువ రాదొ పరాత్పరా! – 28**

భక్తి శ్రద్ధలలో నిష్ణాతుడైన తాయుమానవర్ యవ్వనంలోనే తనను పరామానందపథం వైపు నడిపించిన పరమాత్మునికి దాసోహమన్నాడు.

**ప్రేమపథ మెఱుగని నను వెన్నంటి**
**ఎఱుకలేని చిరు ప్రాయముననె**
**ఆశల వెల్లువను ప్రవహింపజేసితిని**
**చెడితి, నశించితినని ఎలుగెత్తి**
**ఆర్తనాదమొనరింప జేసితివీవు**
**ఆధ్యాత్మిక మోహమును నాలో... – సుఖవార్ధి – 2**

'పొందిన మేను' అనే శీర్షికలో మాతృభూతేశ్వరా! నువ్వు మౌనాన్ని అనుగ్రహించిన కాలంలో నేను నా సర్వస్వాన్ని నీకే సమర్పించాను. నేను

అన్నిటినీ సమర్పించిన పిదపకూడ మాయకు లోనై 'నేను' అని అహంకరించడం ఎందువల్ల! అని వాపోయాడు.

ద్రవిడ సంస్కృత భాషల్లో సమాన పాండిత్యం గల తాయుమానవర్ ఉభయభాషల పట్ల సమాన అభిమానం కలిగి ఉండేవాడు. తన వద్దకు సంస్కృత పండితుడు ఎవరైనా వచ్చి భాషోన్మాదాన్ని ప్రదర్శిస్తే తమిళభాషలోని వైశిష్ట్యాన్ని, సౌందర్యాన్ని వివరించి అతడి మదమణచే వాడు. అలాగే తమిళ పండితుడు దురహంకారాన్ని చూపితే సంస్కృతభాషలోని అనర్ఘరత్నాలను ఉదాహరించి అతడినోరు మూయించేవాడు. తానింతటి ప్రజ్ఞాపాటవాలు కలిగినవాడైనా, పండితుడైనా - వివేకంలేని పండితులకంటె పామరులు గొప్పవారని భావించేవాడు.

**విద్యనెఱుగని వారె యోగ్యులవని;**
**నేర్చియు జ్ఞానశూన్యులైన వారి**
**కర్మఫలము నేమని చెప్పుదు? - సిద్ధగణం - 10**

తాయుమానవర్ అంతఃపుర సంప్రతిగా ప్రతిభావంతుడిగా మన్ననలు పొందుతున్నా, అతడి అంతరంగం మాత్రం అనుక్షణం పరమాత్ముని స్మరిస్తూ ఉండేది.

* * *

# 2. సద్గురు దర్శనం

**అజ్ఞానతిమిరాంధస్య, జ్ఞానానంద శలాకయా ।**
**చక్షురున్మీలితం యేన తస్మై శ్రీగురవే నమః ॥**

అజ్ఞానమనే అంధకారం చేత కప్పబడిన నా కళ్ళను శుద్ధజ్ఞానమనే కాటుక చేత ఎవరు తెరిపించారో ఆ గురుదేవునికి నా నమస్సులు.

**అన్వేషణ**

పుట్టుకతోనే అంధుడైన వ్యక్తికి ఔషధసేవనం వల్ల కాని, శస్త్రచికిత్స వల్ల కాని, కళ్లు కన్పించాయని అనుకుందాం. వస్తువుల్ని చూడగల శక్తి అతడికి కలుగుతుంది. కాని అతడు చూసే వస్తువుల లక్షణాలు, వాటి ప్రత్యేకతలు, మంచి చెడులను గ్రహించే ప్రతిభ అతడికుండదు. వాటిని పుట్టిన నాటినుంచి పరిశీలించిన మరోవ్యక్తి విడమరచి చెప్పినపుడు అతడికి వస్తుస్వభావం బోధపడుతుంది. అలాగే తాయుమానవర్ వంటి జిజ్ఞాసువులకు తగిన గురువు లభించకపోతే ముక్త స్థితిని అందుకోవడం అసాధ్యం కావచ్చును.

చరిత్రలో ఆచార్యుల, మహర్షుల జీవితాలను పరిశీలిస్తే, వాళ్ళకి దైవానుగ్రహం, గుర్వనుగ్రహం లభించినట్లు బోధపడుతుంది. మహానుభావుల జీవిత చరిత్రలన్నీ కూలంకషంగా తెలిసిన తాయుమానవర్ గురువుకోసం అన్వేషించసాగాడు.

**ఎన్నడు నీదయ నాపై కలుగునోయని ఎదురు చూడ**
**కానలేని ఎడద నను దహియించుచున్నది - సుఖవార్ధి - 11**

**నినుచేర దిశల వెతికితి, నమస్కరించితి**
**కానక కృశించితి, మోహమును తొలగింపుమా! పరాత్పరా!**

అని విలపించడం ద్వారా సద్గురు దర్శనం కోసం ఆయనెంత తపించాడో అర్థమవుతుంది.

తిరుచ్చిరాపళ్ళి కొండమెట్లు ఎక్కేమార్గం ప్రారంభంలోనే సారమాముని ఆశ్రమం ఉంది. సారమాముని తిరుమూలర్ (తిరుమందిరం కర్త) గురుపరంపరలో వచ్చిన యోగిపుంగవుడు. తిరుమూలర్ సాక్షాత్తు నందీశ్వరుని శిష్యుడు. కైలాసపర్వతంలో నందీశ్వరుని వద్ద శిక్షణ పొంది తమిళనాడు చేరుకున్నాడు. మూడువేల తమిళగీతాలతో యోగ సర్వస్వాన్ని వివరించిన బ్రహర్షి ఆయన. (మూడువేల సంవత్సరాలు జీవించాడని ప్రతీతి) ఆయన శిష్య, ప్రశిష్య పరంపరలో వచ్చిన సారమాముని తిరుచ్చిరాపళ్ళిలో ఉంటూ జ్ఞానోపదేశం చేసిన చోట వెలసిందే సారమాముని మఠాలయం. ఈయన సమాధిలో పూర్ణత్వం పొందినచోటే సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం స్థాపించబడింది. నేటికీ ఆ ఆలయం ఉంది.

## గురూపదేశం

సారమామునికి పిదప క్రమంగా మునిశ్రేష్ఠులు ఈ మఠాధిపతులై జిజ్ఞాసువులకు ఆధ్యాత్మిక మార్గదర్శకులయ్యారు. తాయుమానవర్ జీవించిన కాలంలో మఠాధిపతిగా మౌనగురుదేశికులు అనే శివయోగి ఉండేవారు. ఆయన మిక్కిలి పరిమితంగా మాట్లాడేవారు కనుక వారికి మౌనగురువు అనే నామం ప్రసిద్ధమయింది. వీరు ధర్మపురి శైవపీఠాధిపతులవద్ద దీక్ష పొందిన వారు. చిదంబర పట్టణం నుంచి బయలుదేరి పలు పుణ్యక్షేత్రాలను దర్శించి తుదకు సారమాముని ఆశ్రమం చేరి అక్కడే నివసించ సాగారు. భక్తులకు ఆయన చూపిన సన్మార్గం కారణంగా క్రమంగా ఆశ్రమానికి మౌనగురుమఠమనే వ్యవహారం ప్రజల్లో ఏర్పడింది. ఆయన 17-వ మఠాధిపతిగా వ్యవహరించారు.

కొంతకాలానికి మౌనగురుదేశికులు ధర్మపురి పీఠాధిపతుల సమక్షానికి వెళ్ళి, సారమాముని మఠపాలనను వారికి అప్పగించారు. నాటినుంచి మఠనిర్వహణ ధర్మపురి పీఠాధిపతుల ఆధిపత్యంలో కొనసాగింది. ఆ పరంపరలో వచ్చిన ఆచార్యులే గడచిన 400 సంవత్సరాలుగా మఠబాధ్యతల్ని స్వీకరించి నిర్వహిస్తున్నారు.

తాయుమానవర్ ప్రతిరోజు తాయుమానవస్వామిని దర్శించి తిరిగివెళ్తూ, సారమాముని మఠసమీపంలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామిని ప్రార్థించి వెళ్లేవాడు. ఒకరోజు మౌనగురుస్వామి ఆయనకు ఎదురుపడ్డారు. ఆయనను దర్శించగానే తాయుమానవర్ మనస్సు పరవశానికి లోనయింది. వెంటనే ఆయనకు సాష్టాంగ ప్రణామం చేశాడు. తాయుమానవర్ ముఖంలో కన్పించిన వర్చస్సు, అతడి వినయం మౌనగురువును ఆకట్టుకుంది. అతడిని శిష్యుడిగా స్వీకరించారు.

విద్యార్జనలో ఉన్నత ప్రమాణాలు అందుకున్న తాయుమానవర్ వేదాది గ్రంథాలలో, తమిళ శైవమత గ్రంథాలతో, ఇతర మతసాంప్రదాయాలలో తనకు కలిగిన సందేహాలను గురువుతో చర్చించి తీర్చుకునేవాడు. మౌనగురువు శిష్యుడికి యోగ, జ్ఞానపద్ధతుల్ని బోధించే వారు.

మౌనగురువు తాయుమానవర్‌ను తొలి సమావేశంలోనే శిష్యుడిగా స్వీకరించారు. అప్పుడాయన చేతిలో ఒక గ్రంథం ఉంది. అది మెయ్‌కణ్డ శాస్త్ర సంబంధమైన 14 గ్రంథాల్లో ఒకటైన శివజ్ఞానసిద్ధియార్ అనే గ్రంథం. అందులోని ఎనిమిదోసూత్రం 30-వ పాటలోని తొలి సగ భాగాన్ని పఠించి తాయుమానవర్‌కు సద్గ్రంథ పఠన ఆవశ్యకతను తెలియజేశారు. అందుకు తాయుమానవర్ రచించిన ఈ క్రింది పద్యపాదాలు సాక్ష్యం.

**పద్యము నొక సగము బోధించి నిరర్ధకమౌ**
**సంసారమును చూపిన గురుపదముల ప్రణమిల్లు టెన్నడో - 16**

తాయుమానవర్ సాక్షాత్తు పరమశివుడే మౌనగురువుగా వచ్చి తన్ననుగ్రహించినట్లు భావించాడు. 'ఏనాడో' అనే శీర్షికలోని ఆరుపద్యాలలో (ద్విపద వంటిది) మౌనగురువును స్తుతించారు. అందులో 'మూలర్' అనే పదం తిరుమూలర్‌ను, అన్నిటికీ మూలమైనవాడు ఆదిదేవుడు అనే అర్థంలోను వ్యవహరించాడు.

తాయుమానవర్ తన గురుదేవుల వద్ద యోగ, జ్ఞాన పద్ధతుల్ని అభ్యసించడం మొదలు పెట్టినప్పటినుంచి పఠన శ్రవణ మనన నిష్ఠలను శ్రద్ధగా పాటించసాగాడు. తీవ్రసాధనలో నిమగ్నమయ్యాడు. ఎన్నో ఆధ్యాత్మిక గీతాలను రచించాడు.

చిన్మయానంద గురువందనం శీర్షికలో దక్షిణామూర్తి స్తుతి గీతాలున్నాయి. తన గురువుయొక్క ఔన్నత్యాన్ని మౌనగురువందనం అనే తిరుప్పదిగం (పది భక్తిగీతాలున్న గ్రంథం)లో ప్రశంసించారు. అందులోని ప్రతిపాట చివర

**మంత్రగురువర్యా! యోగతంత్రగురుదేవా! మూలుని**
**సంప్రదాయమును పాటించు మౌనగురుమూర్తీ!**

అనే మకుటం ఉంటుంది. ఈ గీతాలన్నిటినీ తాయుమానవర్ పినతల్లి కుమారుడైన అరుళైయర్ భద్రపరచి ప్రచారం కల్పించాడు.

విజయరంగ చొక్కనాథ నాయకుడు తాయుమానవర్ ద్వారా పలుశాస్త్ర రహస్యాలను అవగాహన చేసుకునేవాడు. యువకుడైనా, అతడి ప్రతిభకు ముగ్ధుడై భయభక్తులు ప్రదర్శించేవాడు. ఆయన ఒకరోజు తాయుమానవ స్వామికి నమస్కరించి "ఆర్యా! మీలో నిక్షిప్తమై ఉన్న దివ్యజ్ఞాన సంపదను ఇప్పుడిప్పుడే సందర్శిస్తున్నాను. మీకు కావలసిన దేదైనా నాచేత చేయించుకొని నన్ను ధన్యుణ్ని చెయ్యండి. మీ నియమ నిష్ఠలకు ఎటువంటి అవరోధం కలగకుండా కొనసాగడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. నాకీ అదృష్టాన్ని ప్రసాదించండి "అని విన్నవించాడు. నాటినుంచి తాయుమానవర్ దీక్షకు అనుకూల పరిస్థితుల్ని కల్పించాడు.

ఆ రోజుల్లో తిరువానైక్కా (తిరుచ్చి సమీపంలోని పుణ్యక్షేత్రం) అఖిలాండేశ్వరి దేవిమీద స్తుతిగీతాలను రచించాడు. ఆ సమయంలో తనకు సన్యాసదీక్ష అనుగ్రహించమని తన గురువును అర్థించాడు. కాని మౌనగురువు

కొంత కాలం గృహస్థజీవితం గడిపిన తర్వాతే నీకిది సాధ్యం అని చెప్పడంలో అప్పటికి ఆ ప్రస్తావనను విరమించాడు.

మౌనగురువు కొంతకాలం దేశాటనకై బయలుదేరారు. గురువియోగాన్ని సహించలేని శిష్యుడు ఆయనను అనుసరించాడు. అప్పుడు శిష్యుణ్ని చూసి 'సుమ్మాఇరు' (ఊరక ఉండు) అని ఆదేశించి ఆయన ముందుకు సాగారు. ఈ మాటలు తాయుమానవర్ కు వేదమంత్రాల్లా విన్పించాయి. ఈ రెండు సామాన్యమైన మాటల్ని ఆయన జీవితాంతం మననం చేస్తూనే ఉన్నాడు. అతడి గుండెల్లో నిరంతరం ఆ మాటలు ధ్వనింప సాగాయి.

మౌనగురువందనం అనే శీర్షికలోని ఒక పాటలో "గురువర్యా! మీరు ఆదేశ రూపంలో వెలువరించిన మాటలను నన్నుద్ధరించే మంత్రాలుగా భావించాను. నిరంతరం స్మరించాను. పర్వత సమానంగా తలదాల్చాను." అని పేర్కొన్నాడు. మరో పాటలో తన మనస్సును మందలిస్తూ "గురువు యొక్క పవిత్ర వదనం నుంచి జాలువారిన మాటలను ఎక్కడ పోగొట్టుకున్నావు?" అని ప్రశ్నించి హెచ్చరించాడు. ఆయన ప్రదర్శించిన గురుభక్తి న భూతో న భవిష్యతి.

* * *

# 3. సన్న్యాస జీవితం

**నానా యోనిషు జాతస్యదేహినో యస్యకస్యచిత్**
**కోటి జన్మార్జితైః పుణ్యైర్మయి భక్తి ప్రజయతే - శ్రీ శివగీతా - 14-40**

శివభక్తి ఏర్పడడం చిన్న విషయం కాదు. కోటిజన్మల్లో ఆర్జించిన పుణ్యంవల్ల కలుగుతుంది.

**విరక్తి**

విజయరంగ చొక్కనాధనాయకుడు దివంగతుడయ్యాడు. పిదప ఆయన భార్య మీనాక్షిదేవిపాలన కొనసాగింది. ఆమె తాయుమానవర్ అందం చూసి మోహించింది. ఒకరోజు తనలోని ప్రేమోన్మాదాన్ని బహిర్గతం చేసింది. తనకోరికను తీర్చమని, తనకున్న సర్వస్వాన్ని అతడికి సమర్పిస్తానని ఒత్తిడి చేసింది. ఆమె మాటలు అతడికి శరాఘాతాలై తగిలాయి. చెవుల్లో సీసం కరిగించి పోసినట్లనిపించింది. రాణితో ఆమె కోరిక నీచమైనదని పలువిధాలుగా హితోక్తులు పలికాడు. ఆ దురాలోచనకు స్వస్తి పలకమన్నాడు. ఆమె ఎన్నోవిధాలుగా తన వాంఛను వెలిబుచ్చింది. తాయుమానవర్ ఆమెను సంపూర్ణంగా తిరస్కరించాడు.

గృహోన్ముఖులైన అతడికి రాణి చేష్టలు దుర్భరంగా తోచి మనస్సు వికలమయింది. ఈ సన్నివేశమే ఆయనకు స్త్రీలపట్ల ఏహ్యభావాన్ని కలిగించిందని, అందుకే ఆయన అనేక గీతాల్లో స్త్రీలపై ద్వేషాన్ని, వాళ్ళపై నిరసన భావాన్ని ప్రకటించారని విమర్శకులు పేర్కొంటారు.

మరికొందరు విమర్శకులు ఇటువంటి ఘటన జరగలేదని పేర్కొని, రాణికి కూడ ఆయనపై భక్తిభావం ఉండేదని అందుకో సన్నివేశాన్ని వివరించారు. ఒకానొక సమయం తాయుమానవర్ కీలకమైన తాళపత్రాలను పరిశీలిస్తూ, హఠాత్తుగా తన చేతిలోని పత్రాలను నలిపి పొడి పొడి చేశాడట.

అలా ఎందుకు జరిగిందో అతడికీ బోధపడలేదు. ఇది జరిగిన కొన్ని గంటలకు వేగులు రాణివద్దకు వచ్చి తిరువానైక్కా ఆలయంలో జరిగిన ఒక దుర్ఘటనను చెప్పారు. ఆ రోజు అర్చకుడు దేవేరికి హారతి ఇస్తున్న సమయంలో అఖిలాండేశ్వరిదేవి వస్త్రం మీద నిప్పు రవ్వ పడి కాలిపోతుండగా, రెండు చేతులు వచ్చి ఆ మంటను ఆర్పాయని, అందువల్ల ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు.

ఆ ఘటన సరిగ్గా తాయుమానవర్ తాళపత్రాలను నలిపిన సమయంలోనే జరిగింది. ఇది విన్న రాణి, ఉద్యోగులు నిర్ఘాంతపోయారు. తాయుమానవర్ గొప్పతనాన్ని ప్రశంసించారు. పశ్చాత్తాపంతో కుమిలిపోతున్న తాయుమానవర్ కూడా సంతోషించాడు. రాణికి అతడిమీద మరింత గౌరవం పెరిగింది. వాస్తవానికి శివసాక్షాత్కారం పొందడమే తన జీవితలక్ష్యమని, తన సాధనకై శివక్షేత్రయాత్రకు అనుమతించమని రాణిని కోరి ఆయన యాత్రకు బయలుదేరాడని వారి కథనం.

పై రెండింటిలో తొలి సంఘటనే వాస్తవమని విశ్వసించే విమర్శకులు ఎక్కువ. అందుకు తగినట్లు స్త్రీసాహచర్యం సర్వవిధాల అనర్థహేతువని వర్ణించిన గీతాలు అనేకం ఆయన రచనల్లో కన్పిస్తున్నాయి.

**తటిల్లతను బోలు నడుము విరుగునేమోయను**
**శంకతో నాజూకు కాలిగజ్జెలు గుసలు వోవ**
**వాచి ఉబికి నటులున్న పెనుభారపు చనులు**
**జారెడి భంగి నొప్పు పడతులపై మరులుగొని**
**నావలె వెంబడించిన మొప్పెలు భువిపై**
**పండిత పామరలందెవ్వరైన...   - తేజోమయానందం-10**

మరోపాట

**భవాంధకార జలధిలో మునిగి**
**అహమ్మను మొసలి నోట బడి**

**ద్వివిధ కర్మ తరంగాలచే విసరబడి**
**నీటి బుడగల బోలు చనుగవల**
**సోయగము జూచి ప్రవాళాధరములున్న**
**పడతి కామపూరిత చండమారుతపు**
**సుడితాకిడికి జ్ఞానమను తెడ్డువిడిచి**
**బుద్ధి చెదరి ఓటి ఓడలను యమభటులు**
**వచ్చెదరని జంకు సరంగు సరణి...**
**కన్నీటి జడిని కురిపించు సామాన్యుడను**
**వర్ణనాతీతమగు ముక్తితీరమును చేర**
**కృపజూపుమో దేవా! తేజోమయానందమా! - తేజోమయానందం-1**

పై పాటలేకాక ఏనాడో! శీర్షికలోని 15 ద్విపదల్లో (కణ్ణి అనే ఛందస్సు) ఇటువంటి భావాలే వ్యక్తీకరించాడు.

**మదనుని ఆహ్వానించి, కనుల వలను విసరి**
**వలపించు ఇంతుల మరచుటెన్నడో - 4**

**వాచి వ్రేలాడు పాలిండ్లపై వాలి**
**నిదురించు సోమరితనమును వీడుటెన్నడో - 6**

వాస్తవానికి పైన పేర్కొన్న లక్షణాలేవీ ఆయనలో లేదు. అటువంటి కోరికలతో సతమతమయ్యేవారిని హెచ్చరించడమే ఆయన ఉద్దేశం.

## తీర్థయాత్ర

ఇకపై తిరుచ్చిరాపల్లిలో ఉంటే రాణినుంచి తనకు ముప్పులు తప్పవని, ఆ రాత్రివేళ తన పినతల్లి కుమారుడు అరుళైయరుతో బాటు నగరాన్ని విడిచిపెట్టాడు. దక్షిణదిశగా పయనించాడు. నల్లూరు అనే కుగ్రామం చేరుకున్నప్పుడు తాయుమానవర్ తాను ఎల్లప్పుడూ ఉంచుకునే శివపూజా పేటికను మరచిన విషయం గ్రహించాడు. తన తమ్ముణ్ని పేటికను

తీసుకురమ్మని చెప్పి పంపించాడు. అలసటతో నేలమీద కూర్చున్న అతడిని చూసి గ్రామప్రజలు పాలు ఆహారంగా తీసుకొమ్మని ప్రార్థించారు. అప్పుడు తాను రచిస్తున్న కరుణాపయోనిధీ! పదిగంలోని 'చేయలేదు నీ పూజను' అని మొదలయ్యే ఆరవ పాటను పూర్తిచేసి తన ఆకలిని తీర్చుకున్నాడని ప్రతీతి.

తాయుమానవర్ నగరాన్ని విడిచి పెట్టాడని రాణి తెలుసుకుంది. కోపంతో ఒకానొక తంత్రజ్ఞుణ్ని పిలిచి తాయుమానవరును వెతికి ప్రయోగం చేసి తీసుకురమ్మని ఆజ్ఞాపించింది. తాంత్రికుడికి నల్లూరులో ఆయన ఉన్నాడని తెలిసింది. అక్కడికి వెళ్లి తాయుమానవర్ వెనుక నిల్చొని వశ్యమంత్రాన్ని పఠించసాగాడు. జ్ఞాననిష్ఠతో ఉన్న తాయుమానవర్ వెనుతిరిగి చూశాడు. తాంత్రికుడు ఆయన ముఖవర్చస్సును చూసి చేష్టలుడిగి ఆయన పాదాలముందు మోకరిల్లి తన్ను క్షమించమని ప్రార్థించాడు. పిదప వెనుతిరిగి వెళ్లాడు.

రామేశ్వరం వెళ్లాలని అరుళైయరుతో బాటు తాయుమానవర్ పయనమయ్యాడు. 'విరాలి' అనే పర్వత ప్రాంతానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆ ప్రాంతంలో నివసిస్తున్న దాత కలలో శివుడు సాక్షాత్కరించి 'నా పుత్రులు ఇద్దరు ఆకలితో ఉన్నారు. వాళ్ళకి భోజనాదికాలు ఏర్పాటుచేసి, కావలసిన సదుపాయాలు సమకూర్చ'మని ఆదేశించాడు. దాత వెంటనే బయలుదేరి స్వామి ఆదేశాన్ని పాటించాడు. పిదప కొన్ని రోజులబాటు సోదరులు అక్కడే గడిపారు. అప్పుడు గర్భంతో ఉన్న దాతభార్య మగశిశువును ప్రసవించింది. అతిథి వచ్చిన వేళా విశేషంగా భావించి దంపతులు శిశువుకు తాయుమానవర్ అనే పేరు నుంచారు. ఇప్పటికీ ఆ వంశంలో పుట్టే మగశిశువులకు 'తాయుమాన' అనే నామాన్ని జతచేర్చి నామకరణం చేస్తున్నారట.

దాత ఆదరణతో సోదరులున్న రోజుల్లో సిద్ధుడొకడు అక్కడికి వచ్చాడు. తాయుమానవర్ పాటిస్తున్న నియమనిష్ఠలను నిశితంగా గమనించిన ఆయన వాళ్ళని సిద్ధులున్న చోటికి తీసుకొని వెళ్లాడు. ఈ సమయంలోనే 'సిద్ధగణం'

అనే పదిగాన్ని (పతికం) తాయుమానవర్ రచించాడు. ఒక జన్మలోనే కాయసిద్ధిని, మోక్షసిద్ధిని పొందాలని శ్రమించేవారు సిద్ధులు. ఆ ప్రభావంతోనే తాయుమానవర్ సిద్ధుల ఆదర్శాన్ని ప్రతిబింబించే విధంగా కొన్ని గీతాలను రచించారు.

పరమానందం శీర్షికలోని గీతాలు ఆ సందర్భంగా రచింపబడినవి. తర్వాత తాయుమానవర్ పుదుక్కోట్టై సమీపంలోని 'కపిలై' (శ్రీగోకర్ణం) అనే నగరానికి వెళ్లారు. అక్కడ కొలువున్న పెరియనాయగి (బృహన్నాయిక)పై 'గాలిని బంధించి' అనే గొప్ప గీతాన్ని రచించారు.

**....అనుగ్రహమను నీటితో తడిపి**
**నారునాటి జ్ఞానమను పంటను పెంచి**
**ఇంద్రియాలనెడు గొడ్డుటావులను**
**యముడను తీక్ష్ణస్వరూపుని నిరోధించి**
**శివానుభూతి ఫలమును కటాక్షించి**
**ననుపాలింపరాదొ! బ్రహ్మాండ కోటుల**
**సృజియించిన పరమేశ్వరీ!**
**కపిల నగరమున కొలువు దీరి**
**కరుణ జూపు బృహన్నాయికా! - 1**

తనలోన మౌనమనే పంటను ఎదగనివ్వమని దేవిని ప్రార్థించాడు. రామనాథుని దర్శించడంకోసం రామేశ్వరం చేరుకున్నారు.

**మూఢ హృదయమా! తనమేని సగమున**
**ప్రియసఖిని దాల్చి చెలగువాని, అభంగుని**
**భవనసముదాయముతో పరివేష్టితుడైన**
**రామనాథుని సతతము చింతన చేయుమా!**

అని మనస్సును ప్రబోధించాడు.

రామేశ్వరంలో కొలువుదీరిన అమ్మవారిని సేవించుకున్నాడు. ఆమెపై మలైవళర్ కాదలి (పర్వతవర్ధిని) అనే శీర్షికలోని ఎనిమిది పాటలను రచించాడు.

**నదులనెన్నిటినొ ఇముడ్చుకొను కడలి వలె**
**పలుమతాలకతీతమై శ్రేష్ఠమై పరగు**
**పరమజ్ఞానానంద జ్యోతి స్వరూపమా!**
**నాదాంత రూపమా! వేదాంత మౌనమా!**
**అహంకారమడచి, నా అజ్ఞానమును**
**నధఃకరించిన పూర్ణచంద్రాననా!**
**మధు సూదనుని చెల్లెలా! పర్వత రాజు**
**కనుల కానందమొసగు పర్వతవర్ధినీ.**

అని సంబోధిస్తూ ఆమె కరుణాకటాక్షం తనపై కొంత ప్రసరిస్తే చాలు. సకలైశ్వర్యాలు సమకూరినట్లేనని ప్రకటించాడు.

ధనవంతులకు దాస్యంచేసే దురవస్థ గురించి చెబుతూ పర్వతవర్ధిని పాదాలను ఆశ్రయించాడు.

**ఉప్పిడిన కుండవలె, దుర్భర జీవితమున**
**శరీరమంతయు శిధిలమై**
**ధనాఢ్యుల గృహముల ముందు దీనుడనై**
**నిలుచునటుల బ్రహ్మదీవించిన పాపిని**
**చేపట్టిన వృత్తులన్నియు చెడినవి**
**నీ చరణముల నాశ్రయించితిని**

మట్టికుండలో ఉప్పును పెడితే పైకి పొందికగా కన్పించినా లోపల పాడైనట్లు, శరీరం పైకి ఎంత చక్కగా కన్పించినా, లోపల పేరుకున్న మానసిక దుఃఖం వల్ల కృశించిపోతుంది. కనుక ఓ దయగల తల్లీ! నీ పాదాలే శరణం – అని ప్రార్థించాడు.

ఆయన రామేశ్వరంలో ఉన్న రోజుల్లోనే వర్షాలు పడక దుర్భిక్షం పెరిగింది. అప్పుడు ఇతడో భక్తి గీతాన్ని ఆలపించడంతో వర్షం కురిసిందని అనుశ్రుతంగా వినవస్తున్న కథ.

## గృహస్థ జీవితం

రామేశ్వరంలో కొన్ని రోజులు గడిపిన తర్వాత సోదరులిద్దరూ ఉత్తరదిక్కుగా పయనించారు. తాయుమానవర్ సోదరుడు శివచిదంబరం తన మనుష్యుల ద్వారా ఆయన వివరాలను తెలుసుకున్నాడు. అతడు తమ్ముణ్ని కలుసుకొని ఇంటికి తీసుకువెళ్లాలని అనుచరులతో వచ్చాడు. మార్గమధ్యంలో వాళ్ళు కలుసుకున్నారు.

శివచిదంబరం సోదరుణ్ణి ఒప్పించి తిరుచ్చిరాపళ్ళికి తనతోబాటు తీసుకువెళ్లాడు. తిరుచ్చిరాపళ్ళిలోని వస్తువులను తీసుకొని తల్లితోబాటు వేదారణ్యం చేరుకున్నారు. తాయుమానవర్ సోదరుడు, తల్లి అతడికి వివాహం జరిపించాలని నిర్ణయించారు. అతడితో ఈ విషయమై ప్రస్తావించారు. తాయుమానవర్ వివాహాన్ని తిరస్కరించాడు. కాని విడువకుండా ఒత్తిడి చేస్తున్న తల్లి, సోదరుల మాటలకు కట్టువడి వివాహానికి అంగీకరించాడు. తన గురువు మౌనముని కూడా తనకు గృహస్థజీవితం కొంతమేర తప్పదని చెప్పిన విషయం కూడా గుర్తుకు వచ్చి సమ్మతించాడు. 'మట్టువార్ కుయలి' అనే పేరున్న వధువుతో ఆయన వివాహం జరిగింది.

**నమ్మిన బంటును నేను, కడు భక్తుడను**
**మాయా జగతిని మత్తిల జేసి**
**సంసారమాయను చూడు చూడుమని**
**నాచే చేయనెంచిన కార్యమెదియో!**
**మహాభారతమందైన నిట్టిది కలదొ!**
**ఇది నీదు శుద్ధనిత్య స్వరూపమా!**

**విశ్వమాయా విలాసము నడుమ**
**మార్గ మొకటి నిర్దేశింపుమా!**
**గాధిగాథయందును నిట్టిదిలేదు కదా!**
**నా చిత్తమిటు మోహము చెందుటేల?**

మహాభారతంలోనైనా ఇది ఉన్నదా? అంటే నీ మాయ ఆ బృహత్తరగాథకంటె విస్తృతమైనదని అర్థం. గాధి గాథ యోగవాసిష్ఠం ఉపశమప్రకరణం గాధ్యుపాఖ్యానంలోనిది. వశిష్ఠుడు శ్రీరామునితో ఇలా అన్నాడు. కోసలదేశంలో ఒకప్పుడు గాధియనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు ఏదో ఒక కోరికతో అరణ్యం వెళ్ళి కంఠం వరకు నీటిలో మునిగి ఉగ్రమైన తపస్సు చేశాడు. విష్ణువు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మంటే అతడు విష్ణుమాయను దర్శించాలని కోరాడు. విష్ణువు అలాగేనని అదృశ్యమయ్యాడు. కొంతసేపటికి గాధి తాను జపిస్తున్న మంత్రాన్ని మరిచాడు. తన ఇంట్లో తాను చనిపోయి ఉండగా బంధువులు తనమీద పడి ఏడుస్తున్నట్లు చూశాడు. కొంతసేపు విలపించి ఆ శరీరాన్ని కాటికి తీసుకువెళ్లి చితిపై ఉంచి కాల్చివేశారు. పిదప హూణమండలంలో ఓ చండాలస్త్రీకి జన్మించి 16 ఏళ్ళ వయస్సులో చండాల కన్యను వివాహమాడి పుత్రుల్ని కన్నాడు. వార్ధక్యం రాకముందే భార్యపుత్రులందరూ ముందే మరణించారు. దుఃఖంతో కీరదేశంలో సంచరిస్తున్న వేళ ఒక ఏనుగు అతడి మెడలో మాలవేసింది. ప్రజలు అతడిని రాజును చేశారు. కొంతకాలానికి అతడో చండాల పురుషుడని తెలుసుకొని ప్రజలందరూ అపవిత్రులయ్యామని భావించి అగ్నిలో ప్రవేశించారు. అతడు కూడా తన వల్ల ఈ అనర్థం జరిగిందని అగ్ని ప్రవేశం చేశాడు. ఆ మంటల తాకిడికి స్పృహకలిగి నీళ్ళలో ఉన్న అతడు తెలివిపొంది విష్ణుమాయను గ్రహించాడు. (ఈ కథ ఇంకా కొనసాగుతుంది) మాయను అవగాహన చేసుకోవడం అసాధ్యమని పై రెండు ఉపమానాల ద్వారా తాయుమానవర్ స్పష్టం చేశాడు.

మౌనగురువు వద్ద జ్ఞానోపదేశం పొందిన పిదప కూడ భగవంతుడు తనకు సంసారబంధం కలిగించిన తీరును చూసి ఆశ్చర్యం పొందడం, ఇచ్ఛాద్వేషాలు పరమాత్మ తనకు కలిగిస్తున్నందుకు వెత చెందడం పై పాటలో తాయుమానవర్ వర్ణించారు.

**సన్యాస దీక్ష**

కొన్ని నెలల బాటు కొనసాగిన దాంపత్య జీవిత ఫలితంగా అతడికో మగశిశువు జన్మించాడు. ఆ బాలుడికి కనక సభాపతి అని నామకరణం చేశాడు. గార్హస్థ్య జీవితం కొనసాగుతున్నప్పుడే అనేక ద్విపదులు (కణ్ణి) రచించాడు. శిశువు పుట్టిన కొంతకాలానికి భార్య మరణించింది. మరికొంత కాలానికి తల్లికూడ శివైక్యం చెందింది. దాదాపు బంధాలన్నీ తొలిగాయి. ఇక తన వద్ద ఉన్న సంపదను, కుమారుణ్ణి సోదరుడికి అప్పగించి, కేవలం కౌపీనవస్త్రధారణతో తీవ్రసన్యాస దీక్ష వహించాడు. క్షేత్ర సందర్శనార్థం బయలుదేరాడు. ఆయనను అరుళైయర్ అనుసరించాడు.

తాయుమానవర్ మౌనదీక్షపై ఆసక్తి కనబరిచారు. గురువు ఉపదేశించిన 'ఊరక ఉండు' అన్న మాటలు ఆయనకు పరమార్థ పథాన్ని నిర్దేశించాయి.

**తండ్రీ! ధర్మస్వరూపమైన నిన్ను నా కొసగి**
**అథముడినైన ననుగైకొంటివేల పరాత్పరా! – 127**

**దృశ్యప్రపంచమందంతట పరంజ్యోతివై గోచరించి**
**మంత్రరాజము ననుగ్రహింప వచ్చిన గురుదేవా! పరాత్పరా – 12**

**భూగగనము లందంతట నినుదర్శింపజేసి**
**పరమానందమును చూపిన దేవా! పరాత్పరా – 13**

యథార్థజ్ఞానం కలిగిన పిదపకూడ అప్పుడప్పుడు వాసనామలం తన్నావరించి మాయలో పడవేయడం చూసి, దానిని సమూలంగా నాశనం జేయాలని ఆశించి సాధనచేశారు.

నిరాశ (కోరిక లేకపోవడమని), వాయునిరోధం మనోనాశనానికి హేతువులని నిర్ణయించారు. మౌనదీక్ష ప్రారంభించక ముందు తన స్థితి నిలా వివరించారు.

మానవాళి పరమార్థ సాధనకై అనుసరించిన పలుమార్గాలు నాకు యోగ్యమైనవని అన్పించలేదు. అందువల్ల పరమపురుషా! నీకు ప్రణమిల్లుతున్నాను. నాలోని అజ్ఞానాన్ని పోగొట్టి సన్మార్గాన్ని చూపమని నిరంతరం ప్రార్థించేవాడిని. మౌనదీక్ష అందుకు తగిన మార్గంగా పరమేశ్వరానుగ్రహంవల్ల స్ఫురించింది. – వేదం 6.

**ఎడద ద్రవించి నీరగునటుల**
**మనోవికాసము నాలో కలిగించి**
**సుఖనిష్ఠ నీవొసగనిచో, నా**
**నిట్టూర్పు ధనంజయ వాయువగు – పంజావిసిరేపులి – 20**

దశవిధవాయువుల్లో ధనంజయ వాయువు ప్రాణోత్క్రమణ సమయంలో చివరగా శరీరాన్ని విడిచేది. నా నిట్టూర్పే ధనంజయవాయువని చెప్పడం ద్వారా ప్రాణాన్ని త్యజిస్తానని భావం. నీపై అనన్యప్రేమను కలిగించి, సుఖనిష్ఠను నాలో కలిగించకపోతే జీవించడం వ్యర్థమని అర్థం.

తన మనస్సును సంబోధిస్తూ ఇలా పేర్కొన్నారు.

"నడుచునపుడు, పరుగిడునపుడు, నిలిచిన వేళను, పలు భావసంచారములు కొనసాగినపుడును, మనస్సు కట్టువడక పలుపోకడలు పోవును. మరణించిన మనస్సనే ఊయలలో శయనించనెంతు. పరమానందము నన్నావహించు" – పంజావిసిరే పులి – 12.

దుష్టచింతనలకు నెలవైన మనమా! దుఃఖమును తొలగింతువుగాక! నేత్రద్వయమా! నిదురను ఆహ్వానింతురుగాక! నాపై ఆన. కరుణాసముద్రుడైన త్రినేత్రుని అనుగ్రహము పొందిన మోక్షాది సర్వ సుపథములను పొందనగును – పైది 13.

మౌనగురువు తాను చూపిన మార్గంలో సుఖం కలుగుతుందని ఆశీర్వదించారని, ఆ పిదప మకరందం వలె మధురమైన మాటలన్నీ మౌనం దాల్చాయని, క్రియలు సమస్తం మౌనరూపమై నిలిచాయని పేర్కొన్నారు. - శరీరంమిథ్య 73.

మౌనస్థితిని తెలిపిన గురువు వైశిష్ట్యాన్ని ఇలా పేర్కొన్నారు.

**జ్ఞాన పథమునకు యోగ్యమగు గురువు**
**దానధర్మముల పోషించిన గురువు**
**తల్లి వలె నను బ్రోచిన గురువు**
**నా హృదయాలయమున కొలువు తీరిన గురువు. - శరీరంమిథ్య - 30**

తాయుమానవర్ గార్హస్థ్యాన్ని త్యజించిన పిదప తిరుచ్చిరాపళ్ళికి వచ్చారు. కొంతకాలం మఠంలో నివసించి గురువును కొలిచారు. శిష్యుని పక్వస్థితిని గమనించిన గురువు, ఆయనకు నిర్వహణ దీక్షను ప్రసాదించి, సన్యాసాన్ని అనుగ్రహించారు. తాయుమానవర్ గొప్పనిధిని కనుగొన్న దరిద్రుని వలె సంతోషించారు. గురువుతోనే నివసిస్తూ ఆయన పర్యవేక్షణలో జ్ఞాననిష్ఠను అభ్యసించసాగారు. ఆ సమయంలో ఆలయంలో కొలువున్న దక్షిణామూర్తి సన్నిధి ముందు భాగాన్ని తన అభ్యాస స్థలంగా ఎన్నుకున్నారు. తమ గురువుల నిర్యాణానంతరం 1644 సంవత్సరం మొదలు కొంతకాలం ఆలయ బాధ్యతల్ని నిర్వహించారు.

చాలా రోజులకు తర్వాత తాయుమానవర్ తీర్థయాత్రలకు వెళ్లాలని సంకల్పించారు. తన తమ్ముడితో దక్షిణ దిశగా పయనించి, అనేక క్షేత్రాలను దర్శించి, రామనాథపురం చేరుకున్నారు. నగరానికి వెలుపల 'కాట్టూరణి' అనేచోట చింతచెట్టు నీడలో ఉంటూ నిష్ఠను కొనసాగించారు. అప్పుడే తనను ఎల్లప్పుడూ వెన్నంటి ఉన్న తమ్ముడికి, కోడిక్కరైజ్ఞాని అనే మరోశిష్యుడికి జ్ఞానోపదేశం చేశారు.

తాయుమాన ఆచార్యులు ఉంటున్న చింతచెట్టు పక్కన ఆయనకు సదుపాయం సమకూర్చే విధంగా ఒక భక్తురాలు చిన్న కొలనును, ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసింది. ఆప్రదేశం ఈనాడు లక్ష్మీపురం అని వ్యవహరింపబడుతూంది.

**శివైక్యం**

ఆచార్యులు చాలారోజులు నిష్ఠలో గడుపుతున్నందున ఆయన శరీరం ప్రాణరహితమైన కొయ్యలా కన్పించింది. ప్రజలు ఆయన శరీరాన్ని త్యజించారని భావించి, దహనం చెయ్యడానికి నిప్పుపెట్టారని, మంట ప్రజ్వరిల్లే సమయంలో కళ్లుతెరచిన తాయుమానవర్ జరిగిన సంఘటనను గ్రహించి ఆ సమయంలోనే శివైక్యం చెందారని జనశ్రుతి.

ఆయన శివైక్యం చెందినరోజు శాలివాహనశకం 1581వ సంవత్సరం శుభకృత్ నామ సంవత్సరం (క్రీ.శ.1662) చైత్రమాసం విశాఖనక్షత్రయుక్త పౌర్ణమి సోమవారం. ఈ వివరాలు ఆయన శిష్యుడు కోడిక్కరైజ్ఞాని రచించిన పాట ద్వారా తెలియవస్తున్నది. ఈ గీతం ఆచార్యులు సమాధిచెందిన చోట వెలసిన ఆలయంలో ఉన్న శిలాశాసనంలో చెక్కబడింది.

అరుళైయర్, ఆచార్యుల పుత్రుడైన కనకసభాపతి పిళ్లైకి జ్ఞానోపదేశం చేశాడు. కనకసభాపతి తంజావూరు సమీపంలోని అన్నంపేటలో నివసించేవారు. ఆయనకుమారుడు అక్షయలింగం పిళ్లై ఆచోట వెలసిన మఠానికి అధ్యక్షుడై బాధ్యతల్ని నిర్వహించాడు. తర్వాత సన్యాసదీక్ష పొందిన వారు ఆ మఠాధిపతులుగా కొనసాగారు.

తాయుమానవర్ రచించిన గీతాలలోని విలక్షణత్వాన్ని, ఆయాగీతాలలో వెలిబుచ్చిన ఆధ్యాత్మికాంశాలను పరిశీలిస్తే ఆయన సమగ్ర వ్యక్తిత్వం బోధపడుతుంది.

* * *

## 4. రచనా వైశిష్ట్యం

**జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః**
**నాస్తి తేషాం యశఃకాయే జరామరణజం భయమ్**

చక్కని కృతులు రచించినవారు, రససిద్ధులు అయిన కవీశ్వరులే గొప్ప అదృష్టవంతులు. వారి యశశ్శరీరానికి జననమరణాలుండవు కదా!

తాయుమానవర్ ఆచార్యులు 1452 గీతాలు రచించారు. అవి విభిన్న ఛందోభేదాలతో, వివిధ శీర్షికలతో ఉన్నాయి. చాలావరకు పద్యం లేదా పాట చివరి పదాన్నో, ప్రారంభపదాన్నో శీర్షికనామంగా పేర్కొనడం కన్పిస్తుంది.

**సంస్కృతభాషా ప్రభావం**

ఆచార్యులు తమ గీతాలలో ప్రయోగించిన సంస్కృత పదాలు కోకొల్లలు. నాయకరాజుల కాలంనాటి విద్యావిధానంలో సంస్కృత ద్రావిడ భాషాధ్యయనం ప్రధానంగా ఉండేది. ఇంతకు ముందే ఆచార్యుల విద్యార్జన గురించి విపులంగా చర్చించడం జరిగింది. తమిళ భాషా సంప్రదాయానికి అవరోధంకాకుండా సంస్కృత పదాలను ఆచార్యులు ప్రయోగించారు. తమిళమాధుర్యానికి ఆయన శైలి మరింత దోహదపడింది. ఆయన సంస్కృతభాషా పదప్రయోగానికి కొన్ని ఉదాహరణలు.

**మంత్రగురువర్యా! యోగతంత్రగురుదేవా! మూలుని**
**సంప్రదాయమును కొనసాగించుదేవా! మౌనగురుమూర్తి**
**చిదంబర చిత్సభలోన నర్తించు**
**కరుణాపయోనిధీ! పరాత్పరా!**
**వేదాంతసిద్ధాంత సామరస్యము స్థిరపడ**
**జ్ఞానధనులౌ సిద్ధగణ రూపా!**
**బ్రహ్మాండముల నిముడ్చు కొనిన**
**సంపూర్ణ పరమానంద స్వరూపా!**

పై గీతంలోని అనేక పదాలు తమిళగీతంలో యథాతథంగా ప్రయోగింప బడ్డాయి. కొన్ని తెలుగు నుడికారానికి అనుగుణంగా అనువదించడం జరిగింది.

మరో తమిళ ఉదాహరణ యథాతథంగా :

నిత్తియమాయ్, నిర్మలమాయ్, నిట్కలమాయ్, నిరామయమాయ్, నిత్తైవాయ్, నీంగా శుద్ధముమాయ్...

ఇటువంటి గీతాలెన్నో ఆయన రచనల్లో కన్పిస్తాయి. వేదమనే పదం చాలాసార్లు ప్రయోగించారు. శుద్దాశుద్ధ, సుగదుక్క, దువందనిరుదువంద (ద్వంద్వ నిర్ద్వంద్వ), (శుద్ధాశుద్ధ) స్తూలసూట్చుమ (స్థూలసూక్ష్మ) ఆసైనిరాసై (ఆశ నిరాశ), భావాభావ, భేదాభేద, ఆది అనాది, నిర్విషయ విషయ, అఖిల నిఖిల – ఇత్యాది సమాసాలన్నీ చోటుచేసుకున్నాయి.

**రూపకాల ప్రయోగం**

ఆచార్యుల గీతాలలో లెక్కలేనన్ని రూపకాలు ప్రయోగింపబడ్డాయి. ఆనందవర్షం, పాపజలధి, జ్ఞానాగ్ని, పాశతిమిరం, జ్ఞానసంజీవి, పిశాచమనస్సు, అమృతప్రవాహం, జ్ఞానవారధి, ఆనందసాగరం, పిశాచమర్కటం, జ్ఞానమదేభం – మొదలైనవి కొన్ని ప్రయోగాలు.

**ఉపమానాలు**

తాయుమానవర్ ప్రయోగించిన ఉపమానాలు కొన్ని విలక్షణమైనవి. మేరువుభంగి స్థిరంగా, నిశ్చలమై పడిఉన్న బొంగరంలా, అణగిన మనస్సులా, తల్లిలేని బిడ్డవలె పాలకు సాటియైన భాష, పలికిన పలుకునే అప్పజెప్పే చిలుకలా, చంద్రునిరాకకై ఎదురుచూసే చకోరపక్షిలా, పాలతో కలిసిన నీరువలె, తోకలేని గాలిపటంవలె, మాయాపటలం పతనమైనట్లు, తల్లివలె ప్రేమతో, అయస్కాంతం ఇనుమును ఆకర్షించినట్లు – ఇత్యాది

**సామెతలు**

'నేటిఘటన - రేపటి సామెత' అన్నదో సామెత. అలాగే ఒకప్పటి జీవితానుభవం ఇప్పటి సామెతగా పరిణామం చెందుతుంది.

జానపదుల సంభాషణల్లో సామెతల ప్రయోగం అత్యంత సహజంగా చోటుచేసుకుంటాయి. వీళ్ళు తమ జీవితానుభవాన్ని కొన్ని మాటల్లోనే ఇమిడ్చి ప్రయోగించగలరు. ఒకవిధంగా ఇవికూడా వేదాల వలె అపౌరుషేయాలే.

జనజీవనంలోంచి రూపొందిన మౌఖికసాహిత్యం, లిఖితసాహిత్యానికి వన్నె చేకూరుస్తుంది. కవులు తమ రచనల్లో సందర్భోచితంగా సామెతల్ని వాడడం, తద్వారా కావ్యపఠనానికి ఆసక్తి కలిగించడం చూశాం.

ఆచార్యులు శివానుభూతి చెందినవారి స్థితిని స్పష్టంగా తెలియ జెయ్యడానికి 'గొడ్రాలికేం తెలుస్తుంది కన్నతల్లి కడుపు కోత' అనే సామెతను కింది విధంగా ప్రయోగించారు.

**కన్న తల్లికే తెలియు నా వెత, సంతు**
**లేని మొప్పె ఎఱుగునో? శివానుభూతి**
**నొందిన వారికె ఆనందాశ్రులు చిందు**
**రాతి గుండెకలవారు పొందగలరొ?**

విత్తులేక మొక్క మొలుస్తుందా? తల్లిలేక గర్భం ఉంటుందా? గడ్డిపోచతో కడలి నీదే సాహసం, కాయలేని చెట్టుపై రాళ్ళు వెయ్యడం - మొదలైన ఎన్నో సామెతల్ని సందార్భనుసారంగా ఆచార్యులు ప్రయోగించారు.

**కోటి కాకులు కలిసియున్నను - ఒక**
**రాయికి నెదురొడ్డునొ?**

**ఛందస్సు**

ఆచార్యులు రచించిన 1452 గీతాలు 17 రకాలైన ఛందోభేదాలతో ఉన్నాయి. ఆయన గీతాలను సంకలన కర్తలు రెండు విధాలుగా వర్గీకరించారు. అవి 1. తమియ్‌మాలై (తమిళహారం) 2. కణ్ణి (ద్విపదవంటి ఛందోభేదం)

తమిళహారంలో 587 పద్యాలున్నాయి. ఇవి వెణ్బా, ఆసిరియం, కలి మొదలైన వృత్త భేదాలతో రచింపబడినవి. వీటి సంఖ్య 587. చందం, పరాపరం (పరాత్పరా), పైంగిళి (చిలుకా) ఎన్నాట్ (ఏనాడో) మొదలైన శీర్షికల్లో కణ్ణిరకాలు. ఆనందక్కళిప్పు (ఆనంద తాండవం) జానపదగేయఫణితిలో కూర్పబడింది. కణ్ణి పద్యాలు 777 ఉన్నాయి. ఆనందక్కళిప్పును కూడా కణ్ణిఛందోభేదంగా పేర్కొన్న వారున్నారు. వాటిలో కలుపుకుంటే 865 (777+88) పద్యాలవుతాయి. కణ్ణి రెండుపాదాల పరిమితిగల చిన్నపద్యం. దాదాపు తెలుగులోని ద్విపద వంటిది. ఇవి పరాపరకణ్ణి, ఎన్నాట్ కణ్ణి (ఏనాడో) పైంగిళి (చిలుకా!) కణ్ణి, కాణ్బేనో (కాంతునో) కాదో, లేదో మొదలైన పద్యం చివరి పదంతోకలిపి వ్యవహరింపబడుతున్నాయి.

రెండోపాదం చివర పై పదాలు సంబోధనా రూపంలో ఉన్నాయి. ఆయా సంబోధనా పదాలను కణ్ణిపదంతో చేర్చి పద్యాలను పేర్కొనడం, శీర్షికపేర్లుగా ఉంచడం జరిగింది.

మొత్తం 56 శీర్షికల్లో 23 భాగాలు పద్యంలోని ముగింపు పదాలతో శీర్షికల పేర్లున్నాయి. కొన్ని మినహా శీర్షికల పేర్లన్నీ ఆయాగీతాల ప్రధాన వర్ణితాంశాన్ని దృష్టిలో ఉంచుకొని పాటల సంపుటికి పేర్లనుంచారు. కొన్ని పాటల శీర్షికల పేర్లు పాటల సంపుటిలోని తొలి గీతంలోని తొలి పదాన్నే ఉంచడం జరిగింది. సిద్దర్‌గణం (సిద్ధగణం), మలైవళర్ కాదలి (పర్వతవర్ధిని) అఖిలాండేశ్వరి, పెరియనాయగి (బృహన్నాయిక) మొదలైన శీర్షికలు వర్ణితాంశాలకు అనుగుణంగా ఉన్నాయి.

శీర్షికల పేర్లు, వర్ణితాంశం, పద్యాల (గీతాల) సంఖ్య కింద పట్టికలో చూపబడ్డాయి.

| వరుస సంఖ్య | శీర్షికపేరు | వర్ణితాంశం | పద్యాలసంఖ్య |
|---|---|---|---|
| 1. | పరమశివునికి ప్రణామం (పరశివ వణక్కమ్) | సర్వాంతర్యామి అయిన శివుని వర్ణిస్తూ ఆత్మసాధనగావించి శివాద్వైతముక్తి పథాన్ని అందుకోవడానికి ప్రణామం చెయ్యడం. | 13 |
| 2. | పదార్థ వందనం (పొరుళ్ వణక్కమ్) | పశు, పతి, పాశాలలో ఉత్తమపదార్థం పతి. జ్ఞానానందపదార్థం. తత్సాధనకోసం ప్రయత్నించాలని ఉద్బోధ. | 12 |
| 3. | చిన్మయానంద గురువు (చిన్మయానంద గురు) | జ్ఞానానందమయుడైన శివుడు గురువు రూపంలో సాక్షాత్కరించి జ్ఞానోపదేశం చెయ్యడం | 11 |
| 4. | మౌనగురువందనం (మవునగురు వణక్కమ్) | తనకు మంత్రోపదేశం చేసి యోగ, జ్ఞానమార్గాలను చూపిన తిరుమూలర్ గురుపరంపరలో వచ్చిన మౌనగురువును స్తుతించడం. | 10 |
| 5. | కరుణాపయోనిధీ! (కరుణాకరకడవుళ్) | నిర్గుణుడైన పరమాత్మ ప్రాణులపట్ల దయగలవాడు కనుక అసంఖ్యాక దివ్యగుణాలకు ఆకరమవుతున్నాడు. త్రినేత్రుడైన నటరాజవర్ణన, 96 తత్త్వాల ప్రస్తావన. | 10 |
| 6. | సిద్ధగణం (సిద్దర్ గణమ్) | అష్టసిద్ధుల వివరణ, ఇంద్రాది దేవతలను సైతం ఆశీర్వదించిన శివరాజ యోగివర్ణన, కాయసిద్ధి, అమరత్వసిద్ధి ఒక్క జన్మలోనే పొందాలనే లక్ష్యం. | 10 |

| వరుస సంఖ్య | శీర్షికపేరు | వర్ణితాంశం | పద్యాలసంఖ్య |
|---|---|---|---|
| 7. | పరమానందమూర్తి (ఆనందమాన పరమ్) | మహాత్ములు తమపై నీచత్వాన్ని ఆరోపించుకొని, దుష్టులుగా తమ్ము తాము చిత్రించుకోవడం; అవి వారి లక్షణాలు కావని ఆ వర్ణనలద్వారా ఎటువంటి నైచ్యస్థితిలో ఉన్నవారైనా ముక్తికి అర్హులేనని ప్రబోధించడమే లక్ష్యమని పేర్కొనడం. | 10 |
| 8. | సుఖవార్ధి (సుగవారి) | రుచికరమైన పదార్థాలు అన్నిటికంటె తియ్యనైనది భగవన్నామమే అని తన్ననుగ్రహించి, అంతర్ధానం చెంది, దుఃఖానికి లోను చేసిన పరమాత్మతో సంయోగమెన్నడో అని విలపించడం | 12 |
| 9. | సర్వవ్యాపకపదార్థం (ఎంగుమ్ నిఱైగిన్ఱ పొరుళ్) | విభిన్నమతాలు భగవంతుని పలురీతులుగా కీర్తిస్తున్నాయి. అన్నీ కలగలిపిన సర్వవ్యాపక స్వరూపుడే పరమాత్మ. నదులన్నీ సముద్రంలో కలిసినట్లే, శివుని వద్దకే జీవాత్మలు చేరాలని అతడు లేనిదే అణువైనా కదలదని పేర్కొనడం | 11 |
| 10. | సచ్చిదానందశివం (సచ్చిదానంద శివమ్) | శివుడు సుగుణుడు, నిర్గుణుడు కూడా. ఉన్నది లేనిదిగా, లేనిది ఉన్నదిగా భ్రమకల్పిస్తున్న మనస్సును – చర్య, క్రియ, యోగ, జ్ఞాన మార్గాల | |

| వరుస సంఖ్య | శీర్షికపేరు | వర్ణితాంశం | పద్యాలసంఖ్య |
|---|---|---|---|
| | | నెఱుగని తనకు, జ్ఞానౌన్నత్యాన్నీ వర్ణించి భగవత్ స్మరణ ఎల్లప్పుడూ ఉండాలని బోధించడం. | 11 |
| 11. | తేజోమయానందం (తేసోమయానందం) | తిరుమూలర్ రచించిన తిరుమందిరం (తిరుమంత్రం) పేర్కొనే యమనియమాదుల్ని ప్రస్తావించి, ఆత్మపరమాత్మలు ఒకటా, రెండా అనే చర్చ చేసి అహంకారమమకారాలను గర్హించడం | 11 |
| 12. | జ్ఞానసుఖోధయలీల (సిర్సుగోదయ విలసమ్) | జ్ఞాన పరమానంద వ్యక్త నృత్యమనే ఈ విభాగంలో అవగాహనకు దుర్లభమైన పరబ్రహ్మను సూచించడం, దృశ్యమాన జగత్తునంతా అఖండ పరమాత్మ స్వరూపంగా ఆరాధించి, ముక్తులతో పరమానంద గృహంలో వసించగల మహద్భాగ్యాన్ని కలిగించమని వేడుకోవడం. | 10 |
| 13. | ఆకార భువనం (ఆగార బువనమ్) | ఆకారభువనమంటే ఇంద్రియాలకు గోచరమయ్యే ప్రపంచం. ఇంతవరకు పేర్కొన్న గీతాలన్నీ పద్యం చివరిపదం శీర్షిక నామంగా ఉన్నవి. ఇది తొలిపద్యం తొలిపాదాదిని ఉన్న సమాసం. శివుడు పరబ్రహ్మ అని, సర్వమతాలలో శైవమే గొప్పదని వర్ణింపబడింది. | 33 |

| వరుస సంఖ్య | శీర్షికపేరు | వర్ణితాంశం | పద్యాలసంఖ్య |
|---|---|---|---|
| 14. | తేనె నెలవు (తేన్ముగమ్) | పద్మభవుడైన బ్రహ్మనుద్దేశించి చెప్పినది. నీచేత సృష్టింపబడిన ప్రపంచం మాయతో కప్పబడింది. ఆ మాయను కుందేటి కొమ్ముతో పోలుద్దామా! ఎండమావి అందామా! ఆకాశంలోని పద్మం అని చెబుదామా? అని ప్రశ్నిస్తూ సనకాది మునుల ననుగ్రహించిన శివుడే పరబ్రహ్మ అని తెలియజేయడం. | 10 |
| 15. | గీతమాలిక (పన్మాలై) | ద్వివిధకర్మలు, చతుర్విధ అంతఃకరణాలు, పంచేంద్రియాలు మొదలైన వాటితో నిర్మితమైన శరీరాన్ని తలచి దుఃఖించడం, సంసార జీవితంపై స్పష్టమైన అవగాహన ఉన్న దానిపై మనసు మరలడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందని భగవంతుని నిర్వికల్ప నిష్ఠతో ఆరాధించాలని వర్ణించడం. | 10 |
| 16. | తలపొక్కటి (నినైవొన్రు) | ఆచార్యులు తమ హృదయాన్ని సంబోధించి రచించిన గీతాలు. సతీసుతులు, బంధుమిత్రులు – ఇత్యాది బంధాలను త్యజించి పరమాత్మస్మృతిని ఆశించడం, ప్రపంచంలోని మిథ్యావస్తువుల బంధంనుంచి తన్ను విడిపించుకొని, సన్యాసదీక్షను స్వీకరించమని ప్రబోధించడం. | 09 |
| 17. | వేదం (ఆరణమ్) | వేదాన్ని వీధిగా, ఆగమాన్ని అశ్వంగా భావించి, దైవాన్ని ఆత్మ కొనసాగించే ప్రయాణంగా అభివర్ణించారు. వేదాన్ని భగవంతుడు చిన్ముద్ర ద్వారా | |

| వరుస సంఖ్య | శీర్షికపేరు | వర్ణితాంశం | పద్యాలసంఖ్య |
|---|---|---|---|
| | | ఆగమాన్ని శరీరం ద్వారా వ్యక్తీకరించినట్లు వర్ణించారు. అంతులేని గృహంలో ఆవాసానికి మౌనదీక్ష కాక మరోమార్గం లేదనడం. | 10 |
| 18. | కాంతాకనకాలు (పొన్నైమాదరై) | ప్రత్యక్షంగా భగవంతుణ్ని ప్రార్థించడం. తన అనుగ్రహానికి పాత్రులైనవారిని పుట్టుకతోనే భగవంతుడు గుర్తిస్తాడు. మనిషి దాన్ని గ్రహించడం లేదు. ఆయనను ఆశ్రయించడం తప్ప ప్రగతికి మరో మార్గంలేదు. భూకాంతాకనకాదుల మీద మోహాన్ని నిరసించాడు. | 78 |
| 19. | చెప్పనలవికాని (చొల్లఱ్కరియ) | భగవద్వైభవాన్ని వర్ణించలేము. తన హైన్యాన్ని వ్యక్తపరచి, తనవంటి పతితుల్ని సృష్టించడంవల్ల పరమాత్మ పొందే ప్రయోజనం ఏమిటి? అహాన్నుంచి, మమకారపు బరువునుంచి నన్ను బాధపెట్టడం ఎందుకని ప్రశ్నించి విముక్తికై అర్థించడం. | 10 |
| 20. | వంచకత్వం (వంబనేన్) | వంచన బుద్ధిగల తనను అనుగ్రహించిన పరమశివుని దయను కొనియాడడం, పరమానంద జ్ఞానం పొందిన ఆయన ఎడబాటును సహించలేనని చెప్పడం. | 10 |
| 21. | శివుని చర్యలు (శివన్ సెయల్) | సర్వమూ శివుని చర్యలేనన్న జ్ఞానం లేదు. దుఃఖహేతువులైన ఆశలను విడిచిపెట్టడం లేదు. ప్రపంచమనే బురదలో పొర్లుతూ లెక్కలేని పాపాలు | |

| వరుస సంఖ్య | శీర్షికపేరు | వర్ణితాంశం | పద్యాలసంఖ్య |
|---|---|---|---|
| | | చేస్తున్నాను. నీ భక్తులకు సేవచేసే భాగ్యానికై ఆయుస్సును అర్థిస్తున్నాను. పరమానందం లభిస్తుందంటే మరో జన్మను ఆశిస్తాను. నీకటాక్షం ఉంటుందంటే సన్యాసం స్వీకరిస్తాననడం. | 10 |
| 22. | తననొకరు (తన్నైయొరువర్) | భగవదైక్యానికి పరమాత్మ అనుగ్రహం కావాలి. అందుకు బంధాలను త్యజించాలి. భగవంతుడినే స్మరించాలి. ద్వంద్వాల నుంచి బయటపడాలి. సమస్తమూ అతడికి సమర్పించాలి. అహంకార మమకారాలను కూకటి వేళ్ళతో పెకలించాలి. | 10 |
| 23. | ఆశ అనే (ఆసైయెనుమ్) | ఈ శీర్షికలోని పద్యాలు విభిన్న ఛందస్సులలో ఉన్నాయి. అలాగే ఆశ, నిష్ఠ, గార్హస్థ్యం, సన్యాసం, పరం, మోక్షం, అనే వివిధాంశాలపై గీతాలున్నాయి. | 40 |
| 24. | నాకని చెయ్యదగు (ఎనక్కెనచ్చెయల్) | నాకని చెయ్యదగినదేదీ లేదని తొలిపద్యం మొదలవుతుంది. అన్నీ భగవంతుడిదే. శరీరం, సంపద, ప్రాణం అతడికి చెందినవే. నేను అన్నీ సమర్పిస్తున్నాను. నాలోని మురికిని తొలగించి, నీ ఇచ్ఛానుసారంగా నన్ను తీర్చి దిద్దు అని పరముని ప్రార్థించడం. | 11 |

| వరుస సంఖ్య | శీర్షికపేరు | వర్ణితాంశం | పద్యాలసంఖ్య |
|---|---|---|---|
| 25. | భువిపై (మండలత్తిన్) | భగవత్తత్త్వాన్ని తెలియజేసే నాలుగుపద్యాలు. మానవ మనస్తత్త్వాన్ని ప్రతిఫలించే ఏడు పద్యాలు, పెక్కుచోట్ల మనస్సును నిందించిన ఆచార్యులు మనసా! నిన్ను 'సత్' అని దీవిస్తున్నాను నువ్వు వచ్చినచోటికే వెళ్లుదువుగాక! అని వ్యంగ్య రీతిలో చెబుతున్నారు. | 11 |
| 26. | పంజావిసిరేపులి (పాయుమ్ పులి) | పులిని బంధించడానికి జింకను ఎరగా ఉంచినట్లు, తనను ప్రాపంచిక వస్తు సముదాయానికి ఎరగా ఉంచినట్లు భావించి, భగవంతుడితో మొరపెట్టుకోవడం. భగవంతుడిని 'తండ్రీ' అని పలుమార్లు సంబోధించారు. | 59 |
| 27. | శరీరమిథ్యాసంబంధం (ఉడల్ పొయ్యుఱవు) | తనకు కలిగిన జ్ఞానమంతటికీ మౌనగురువే కారణమని చెప్పడం. శరీరం, ప్రపంచం, సత్యం కావు. వీటితో బంధాన్ని తెగతెంపులు చేసుకోవాలి. చేతల్లో, తలపుల్లో మౌనం పాటించాలి. వివాదాలు అనవసరం. భక్తివల్ల పాపం పరిహరింపబడుతుంది. | 83 |
| 28. | నిందారహితస్థితి (ఏసఱ్ఱవన్నిలై) | ఆచార్యులు తమ హృదయానికి హితవుపలికే విధంగా ఉన్న గీతాలు. ప్రాపంచిక పంకంలో పడకుండా భగవంతుడి పాదారవిందాలను ఆశ్రయించాలి. | 10 |

| వరుస సంఖ్య | శీర్షికపేరు | వర్ణితాంశం | పద్యాలసంఖ్య |
|---|---|---|---|
| 29. | అడవి – మైదానం (కాడుజ్కరైయుమ్) | మనస్సనే మర్కటం అటు ఇటు గెంతుతూనే ఉంటుంది. శరీరం కూడా ఎన్నో జన్మలెత్తి దయ్యం పట్టిన మర్కటంలా కృశించి ఉంది. అరుదైన మానవ జన్మను సార్థకం చేసుకోవాలి. ఆలస్యమైతే శరీరం అదృశ్యమవుతుంది. త్వరపడమని బోధించడం. | 03 |
| 30. | పొందినమేను (ముగమెల్లామ్) | మౌనదీక్షను ప్రారంభించినపుడే సమస్తాన్ని సమర్పించిన ఆచార్యులు భగవంతుడు మళ్ళీ తనను మాయా ప్రపంచంలోకి నెడుతున్నాడని మొరపెట్టుకోవడం. | 02 |
| 31. | ముఖమంతటా (ముగమెల్లామ్) | భక్తుల ఔన్నత్యాన్ని, తన దైన్యాన్ని ప్రకటించి దుఃఖించడం | 01 |
| 32. | దృఢమెసగ (తిడముఱవే) | ముందు తాను ఎరుగని లోపాలు భగవదనుగ్రహంతో కన్పిస్తున్నాయి. ఆ లోపాల నివృత్తికై పరాత్పరుని ప్రార్థించడం. | 10 |
| 33. | తనను (తన్నై) | మనస్సును మందలిస్తూ తన్నేలిగిన నాయకుడిపై (శివుడు) ప్రేమను చూపమంటున్నారు. ఇహలోక వస్తువుల్ని త్యజించమనడం. | 01 |

| వరుస సంఖ్య | శీర్షికపేరు | వర్ణితాంశం | పద్యాలసంఖ్య |
|---|---|---|---|
| 34. | సృష్టించెదవు (ఆక్కువై) | సృష్టిస్థితిలయలకు కారణభూతుడు శివుడేనని వర్ణన. | 01 |
| 35. | పాతివ్రత్య చింతన (కఋ్వుడై చింద్రై) | పతినే దైవంగా భావించే పతివ్రతలా భక్తుడు శివుణ్ని మాత్రమే పతిగా కొలవాలి. మరోదైవాన్ని ప్రార్థించడం హేయం. లౌకిక ఆకర్షణల నుంచి విముక్తి పొందాలని ఆకాంక్ష. | 10 |
| 36. | పర్వతవర్ధిని (మలైవళర్ కాదలి) | సంగీతాని కనువైన గీతాలు. రామేశ్వరంలో కొలువున్న పర్వత వర్ధిని స్తుతి. ఆమె నారాధించిన వారికి పతి, నిధి, పుత్ర, మిత్రాది 32 భాగ్యాలు సమకూరుతాయి. లోపాలున్నా దేవి అనుగ్రహం చూపుతుంది. | 08 |
| 37. | అఖిలాండ నాయిక (అగిలాండ నాయగి) | ప్రాణవాయువనే మృగంతో పయనించే మనస్సనే మదపుటేనుగును వశం చేసుకుంటే త్రిలోకాలు మెచ్చే శివరాజ యోగసిద్ధిపొంది సుదీర్ఘకాలం జీవించగలరు. తిరువానైక్కాలోని అఖిలాండ నాయికకు విజ్ఞప్తి. | 01 |
| 38. | బృహన్నాయిక (పెరియనాయగి) | కపిలైనగరంలో కొలువున్నదేవతామూర్తి, అనుగ్రహక్షేత్రంలో మౌనమనే నారు నాటి, ఇంద్రియ పశువులు, యముడనే కలుపు పంటను నాశనం చెయ్యకుండా కాపాడి శివభోగమనే ఫలితంలో కొంతభాగాన్ని ఆశించడం. | 01 |

| వరుస సంఖ్య | శీర్షికపేరు | వర్ణితాంశం | పద్యాలసంఖ్య |
|---|---|---|---|
| 39. | తల్లిదండ్రులు (తన్దైతాయ్) | మాయ దిగ్భ్రాంతి కలిగించేది. మాయను నీ కారణంగా జయించాను. తల్లిదండ్రులవలె రక్షించావు. నీ దయ జన్మజలధిని దాటించే నావ. | 07 |
| 40. | కన్నతల్లికే (పెట్రవట్కే) | కన్నతల్లికే కడుపుకోత ఉంటుంది. గొడ్రాలికి ఉండదు. పరమానంద అనుభవం పొందినవారికే ఆనందాశ్రువులుంటాయి. రాతిగుండె కలవారి కెలా ఉంటుంది. శివచరణాలే అభయం. | 11 |
| 41. | వటవృక్షం (కల్లాలిన్) | సనకసనందనాది నలుగురు బ్రహ్మమానసపుత్రులకు జ్ఞానమొసగిన దేవా! సర్వమతాలకూ ఆశ్రయమైన పరమాత్మవు. నన్ను నీ అనుగ్రహమే రక్షించాలి. ఎంతో అద్భుతమైన తమిళకవితలు మహాత్ములు రచించినవి ఉండగా ఈ మూర్ఖుని తమిళం మెప్పుపొందుతుందా! అయినా స్వీకరించమని విజ్ఞప్తి. | 30 |
| 42. | పరిపూర్ణానందం (పరిపూరణానందమ్) | సర్వత్రావ్యాపించినవాడు భగవంతుడు. ఆ అనుభూతి వర్ణనాతీతం. ప్రపంచానుభవాలు ఏవీ తాను కోరినవి కావు. మానవజన్మ నిరర్థకంగా సాగిపోతుంది. ఆశాజలధిలో మునుగకుండా కాపాడడం జగద్రక్షకుని కర్తవ్యం. | 10 |

| వరుస సంఖ్య | శీర్షికపేరు | వర్ణితాంశం | పద్యాలసంఖ్య |
|---|---|---|---|
| 43. | పరాత్పరా! (పరాపరంకణ్ణి-పర+అపర) | ఇవి రెండు పాదాలున్న పద్యాలు. జీవితంలో ఆచార్యులనుభవించిన సకల వృత్తాంతాలు కొద్ది మాటలతో విపులీకరించారు. | 389 |
| 44. | చిలుకా! (పైంగిళి కణ్ణి) | నాయికా నాయక భావంతో మధురభక్తి ప్రధానంగా సాగిన ద్విపద పద్యరచన. | 58 |
| 45. | ఏనాడో (ఎన్నాట్ కణ్ణి) | దైవప్రార్థన, గురువందనం, ఆచార్యవందనం, శరీర నింద, స్త్రీ నింద ఇత్యాది అంశాల వర్ణనలు. కాంతునో (37 పద్యాలు) కాదో (21) లేదో (06) వలదో (06) సుజ్ఞానమా (04), కలగూర గంప మొదలైన శీర్షికల్లోను కవితలున్నాయి. వీటిలో మతం, తత్త్వం, ఆరాధనా పద్ధతులు వర్ణింపబడ్డాయి. | 98 |
| 46. | యథార్థస్థితి (నిన్టనిలై) | నేనున్న ప్రస్తుతస్థితి సహజం. ఆనందం, అక్షయం, అయినా ఇహలోక సుఖప్రవాహంలోకి నన్ను ఆకర్షిస్తుంది అని వాపోవడం. | 03 |
| 47. | పారాయణ మంత్రం (పాడుగిన్ట పనువల్) | తన్ను తాను అర్థం చేసుకోవడానికి భగవంతుడు చూపిన దయను కీర్తిస్తుంది. | 05 |

| వరుస సంఖ్య | శీర్షికపేరు | వర్ణితాంశం | పద్యాలసంఖ్య |
|---|---|---|---|
| 48. | ఆనందతాండవం (ఆనంద కళిప్పు) | శంకర శంకర శంభూ అని మొదలయ్యే ఈ గీతం పండిత పామర జనులందరినీ ఆకర్షించి పరవశింప చేస్తుంది. ఈ జానపద గేయరీతిని తర్వాతి కవులెందరో అనుకరించారు. ఆధునిక కవులైన సుబ్రహ్మణ్య భారతివంటి వారు కూడ ఈ ఛందోరీతిని అనుసరించారు. | 30 |
| 49. | అగవల్ | వృత్తనామం. దేవదేవుడు తనకొసగిన అనేకవరాలను తలచుకొని ప్రశంసా పూర్వకంగా పాడి ఆహ్వానించడం (38 పాదాలు) | 01 |
| 50. | వణ్ణమ్ | ఛందోభేదం<br>తనతన్ దనన తంద తనదన్ దనన దన్ద<br>తనతన్దనన తంద – తన తన తానా<br>తాన తన తన తానతనదా – అనే ఛందంలో చెప్పిన గేయం. మనిషి పుట్టుక, ఎదుగుదల, మరణం మొదలైన మనోమాలిన్యాలు. వీటినడుమ కామక్రోధాదుల బారినపడి తాను పడుతున్న బాధల్ని పేర్కొనడం. | 01 |

## శైలి

'పరమాత్మ పాటలవలె సులభుడు' అని రవీంద్రుడు వర్ణించాడు. తాయుమానవర్ పాటల్లోని శైలి, వాటిలోని వర్ణితాంశాలైన పరమాత్ముని అనుగ్రహం ఈ నిర్వచనానికి సరిపోతుంది.

జీవం లేని పదాలు, పదబంధాలను ప్రయోగించడం శవాన్ని అలంకరించినట్లుంటుంది. ఆచార్యుల గీతాల్లో సహజంగా కుదురుకున్న యతిప్రాసలు, వస్తుగాఢత, పఠితల హృదయాన్ని ఆకట్టుకుంటాయి. పదాలలో కన్పించని సౌందర్యాన్ని, ఆనందాన్ని పదాల కూర్పుతో సాధించవచ్చు. తాయుమానవర్ వర్ణించే పరమానందం కవితానందంగా ప్రకటితమయ్యింది. ఆ పాటలు మనస్సును ద్రవింపజేసి పునీతం చెయ్యగలవు.

తాయుమానవర్ గీతాలను తమిళ ఉపనిషత్తులని విమర్శకులు కీర్తిస్తారు. అంటే అవి ఉపనిషత్తులకు అనువాదమని కాదు. ఉపనిషత్తులను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఆయనకు వాటిపై విశేష అధికారం ఉంది. వాటిలోని సారాంశాన్ని, గహనమైన తాత్త్విక అంశాలను సందర్భానుసారంగా తమగీతాలలో అక్కడక్కడ నిక్షేపించారు. వీలైనంత సులభశైలిలో అవి రచింపబడ్డాయి.

* * *

## 5. పరమాత్మ భావన

**ఏకఏవ తతో లోకాన్ విసృజామి సృజామి చ ।**
**నివాసయామి, గృహ్ణామి తస్మాదేకోఽహమీశ్వరః ॥**

**- శ్రీ శివగీతా 6-38**

లోకాలన్నిటినీ నేనిక్కడినే సృష్టిస్తాను. లయింపజేస్తాను. నిండి ఉంటాను, స్వీకరిస్తాను కనుక నన్ను "ఏక" అని, ఈశ్వరుడని అంటారు.

శిలప్పదిగారం, మణిమేగలై మొదలైన తమిళపంచ మహాకావ్యాలలో తొలుత శైవం అనే పదం కన్పిస్తుంది. నాయనార్ల రచనల్ని తిరుముఱైగళ్ గా విభజించారు. ఇవి శైవమత స్తోత్రగ్రంథాలు. తాయుమానవర్ గీతాలను పరిశీలించినప్పుడు వాటిలో శైవసిద్ధాంతతత్త్వాలు అక్కడక్కడ ప్రస్తావింపబడడం కన్పిస్తుంది. ఈ పాటల సంపుటి కూడ ప్రధానంగా స్తోత్రగ్రంథం. శాస్త్రగ్రంథంకాదు. కనుక ప్రణాళికాబద్ధమైన శైవసిద్ధాంత రచనగా ఉండదు.

### శైవసిద్ధాంతం

శివసంబంధమైనది శైవం. ఆధ్యాత్మిక స్థితిని తెలియజేసేది శైవం. మానవజీవిత చరమలక్ష్యాన్ని తెలియజెప్పేది శైవసిద్ధాంతం. మనిషి అజ్ఞానానికిలోనై బంధాలచేత కట్టువడి ఉన్నాడు. సత్పదార్థ జ్ఞానం లేక అలమటిస్తున్నాడు. దుఃఖం నుంచి బయటపడి సన్మార్గంలో పయనించడానికి శైవసిద్ధాంతం దారి చూపుతుంది. తమిళంలో శైవసిద్ధాంత గ్రంథాలు 14 ఉన్నాయి.

శైవసిద్ధాంతానికి ముఖ్య ఆధారాలైనవి వేదాలు, ఆగమాలు. ఈ రెండూ పర్యాయపదాలుగా వ్యవహరింపబడుతున్నా శైవాగమాలు, వైష్ణవాగమాలని వేర్వేరుగా ఉన్నాయి. వేదాలను, వేదాంతగ్రంథాలను ఆధారం చేసుకొని పదార్థ జ్ఞాననిరూపణ చేసే పద్ధతిని ఆగమప్రమాణం అంటారు. వేదాలను సామాన్య

ప్రమాణాలుగాను, ఆగమాలను విశిష్ట ప్రమాణాలుగాను పరిగణించవచ్చు. భగవతత్త్వాన్ని విపులీకరించేవి వేదాగమాలు. ఇవి రెండుకావు. ఒక్కటేనని మౌనగురువును నుతించిన పాటల్లో ఆచార్యులు స్పష్టంచేశారు.

జన్మదుఃఖం నుంచి బయటపడేమార్గం, భవరోగానికి తగిన ఔషధం తపమాచరించడమే అని ఆచార్యుల అభిప్రాయం. ప్రేమే శివమని బోధించారు. ప్రేమకు హెచ్చుతగ్గులు లేవు. భక్తిభావం, కర్మభావం రెండింటినీ ఆచరిస్తున్నప్పుడు ఆత్మోద్ధరణకు అవి సహకరిస్తాయి. భగవంతుడిని చేరడానికి అనువైన జ్ఞానమార్గాన్ని చూపుతాయి. జ్ఞానం ప్రశ్నించడం, చింతన, అవగాహన, నిష్ఠను పాటించడం మొదలైన నాలుగు పద్ధతులు కలది. ఆణవ, కార్మిక, మాయిక మలాలను పోగొట్టగలది జ్ఞానం. అదే మోక్షానందాన్ని ఇవ్వగలదు. దీనికి ప్రాతిపదిక అయిన ప్రేమ శివమని తాయుమానవర్ నిశ్చితాభిప్రాయం.

శైవసిద్ధాంతంలో త్రివిధపదార్థాలను ప్రముఖంగా పేర్కొంటారు. అవి పతి, పశు, పాశాలు. పతి భగవంతుడు. పశువు జీవాత్మ. పాశం జీవాత్మనుకట్టి ఉంచే బంధం. ఈ మూడూ విభిన్న పదార్థాలు. ఈ మూడూ అనాది. అంటే వీటికి ఆరంభంలేదు. అంతమూ లేదు. తిరుమూలర్ తన తిరుమంత్రంలో ఈ విధంగా పేర్కొన్నారు.

**పతిపశుపాశమను త్రివిధ పదార్థములందు ।**
**పతివలె పశుపాశము లవియు ననాదియగు ॥**

**– తొలిమంత్రం, ఉపదేశం – 3**

ప్రస్తుతం పతి అయిన భగవంతుడి గురించి ఆచార్యులు చెప్పిన కొన్ని అంశాలను పరిశీలిద్దాం. ఆచార్యుల దృష్టిలో పరమాత్మ శివుడు. పురాణాలు పేర్కొనే లీలావైభవాలను ఎక్కువగా ప్రస్తావించక, విశిష్టగుణాలను ఆచార్యులు వర్ణించారు.

జీవాత్మ పంచేంద్రియాలకు, మనస్సుకు వ్యక్తమయ్యే ప్రపంచాన్ని మాత్రమే గ్రహించగలరు. వ్యక్తమవుతున్న ప్రపంచం జడతత్త్వాలు చేత ఏర్పడింది. వ్యక్తమయ్యేవన్నీ నశించేవి. అక్షయమైన భగవంతుడి గురించి జీవాత్మలు తమ త్రికరణాల (మనోవాక్కర్మలు) ద్వారా గ్రహించలేవు. మనస్సు పదార్థస్వభావాన్ని తెలుసుకోవడానికి దేశకాలహేతువులనే కొలమానాలుండాలి. వీటన్నిటికీ అతీతుడు భగవంతుడు. తాయుమానవర్ పరమాత్మ గుణాలను, లక్షణాలను పలువిధాలుగా నుతించారు.

**1. సర్వవ్యాపకుడు :** పరమాత్మ సర్వపదార్థాలలోను వ్యాపించినవారు. సర్వభూతాలలో అతడు, అతడిలో సర్వభూతాలు ఉంటాయన్నది ఆధ్యాత్మిక గ్రంథాలన్నీ ఉద్బోధిస్తున్నాయి. ఆచార్యులు ఇలా చెప్పారు.

**చిత్తమెఱుగని రీతి చిత్తమున నిలిచి వెలుగు దివ్యతేజోమయాకార!**
**– పరమశివునికి ప్రణామం –3**

భగవంతుడు తనలోనే ఉన్నాడని చిత్తం గ్రహించదు. కాని ఆయన ఎడబాటు లేకుండా ఎల్లప్పుడూ అక్కడే ఆవాసముంటున్నాడు.

**ఆదిమధ్యాంతరహితుడై, పునీతుడై**
**అవికారుడై, రాకపోకలు లేని ఆనందమై....**
**– చిన్మయానంద గురువు – 10**

**2. వర్ణనాతీతుడు :** మాటలకందనివాడు. ఎంతటి భాషాపటిమ ఉన్నా భగవద్గుణాలలో లవలేశమైనా (పరమాత్మను) వర్ణించడానికి సాధ్యంకాదు.

మాటల కందని పరాత్పరా!
సుఖవారిధీ! జ్యోతి స్వరూపా! – చెప్పనలవికాని –[1]

**మాటలుడిగి నిలిచితి, ఆనందరూప పరముని!**
**రాత్రింబవళ్ళు స్పృశించు భాగ్యమబ్బునో చిలుకా! – 74**

మాటలలో చెప్పలేని భగవత్స్వరూపాన్ని, అనుభూతితోనే ఆస్వాదించగలం.

**3. ఇంద్రియాతీతుడు :** ఇంద్రియాలకు అగమ్యగోచరుడు.

**అనంతవేదరాశి ఎఱుగని చైతన్యమా !**
**పరమానంద స్వరూపా! కులాతీతా! గుణాతీతా!**
**పరిపూర్ణాకారా! బంధరహితా!**
**అచలా! మోక్షప్రదాతా! పరమేశ్వరా । - ఆశ అనే, 30**

ఇంద్రియాలు స్వల్పమాత్రమైనా గ్రహించలేని దివ్యగుణాలను ప్రస్తావించారు.

**4. కాలాతీతుడు :** త్రికాలాలచేతను ఊహించడం సాధ్యంకానివాడు.

**తిమిరమై, జ్యోతియై, మంచి చెడులునై, నేడునై, రేపునై, నిరతమై,**
**ఏకమై, బహుళమై, సర్వమునై.... పరమానందమూర్తి - 2**

**నిత్యమనిత్యమై, అంజన నిరంజనమై**
**నీత్యవినీతియునై, ఆది అనాదియై**
**విషయ నిర్విషయమై, సకలము నాతడై - పరమానందమూర్తి - 5**

భగవదానందం మనస్సు, కాలం మొదలైన తత్త్వాలకు అతీతమైంది. దోషరహితమైంది.

**5. దేవుడొక్కడే :** భగవతత్త్వం బుద్ధికి అందదు కాని ఆయన అనుగ్రహానికి పాత్రులైన మహాత్ముల ద్వారా నిరుపమాన పదార్థం అతడని బోధపడుతుంది. ఆయన పలువురిగా ఉండే అవకాశం లేదు. అనేక పదార్థాల్లో ఒక్కటి ఉన్నతమైందిగా ఉంటుంది. ప్రపంచాన్ని నిర్వహించడానికి సృష్టి, స్థితి లయలు తప్పనిసరి. వాటి నిర్వహణకు నాయకుడొక్కడు ఉండాలి. పలువురుంటే భేదాభిప్రాయాలుంటాయి. విభిన్నాభిప్రాయాలు ఎందులోను లేని కారణంగా బహునాయకత్వానికి చోటులేదు. కనుక జ్ఞానమయుడైన పరమపురుషుడొక్కడే అని బోధపడుతుంది. ఈ అభిప్రాయాన్నే తాయుమానవర్ ఇలా పేర్కొన్నారు.

**గురురూపమైన లోపరహిత పూర్ణమా!**
**ఏకాత్మా! నిర్మలరూపా! - అగవల్ 2,3.**
**చిద్రూపుడవై, ననుబోలు దాసులకు**
**వ్యక్తమైన ఏకమా! నిర్మల జీవనమా!**
**కనురెప్పపాటైనను ఏమరక హితమొనర్చు**
**నిర్గుణుడవు! నిరుపమానుడివి....**

**6. సర్వభూతాత్ముడు :** ప్రతిప్రాణిలోను ఎడబాటులేక ఉన్నవాడు. అందరిలోను, అన్నిటిలోను ఐక్యమైన వాడు.

**అండమై, పిండమై, అవధిలేని**
**జీవాత్మలకు ఏకాత్ముడవై కొలువైతివి**
**చూచిన వారెవ్వరు? వినిన వారెవ్వరు? - ఆశ అనే - 12**

**7. పంచవృత్తి నిర్వాహకుడు :** సృష్టిస్థితిలయలతోబాటు తిరోధాన, అనుగ్రహాదులనే అయిదు వృత్తుల్ని నిర్వహిస్తున్నవాడు. వాటి నిర్వహణ తన కోసంకాదు. తన కోసం చేసేవాడైతే ప్రపంచబంధాలతో చిక్కువడతాడు. అప్పుడు పరమపురుషుడు అనడానికి అవరోధం అవుతుంది. పరముడు పంచవృత్తుల నాచరించేది ప్రాణుల కొరకే!

**బట్టబయలై, పంచభూతావిర్భావ నిలయమై**
**మాటలుడిగిన మౌనమై - పదార్థవందనం - 3**

**మాయాజగమున పేదనైన నన్ను**
**విడిచిపెట్టితివి, నీ దివ్యానుగ్రహదీప్తిని**
**వెలయు పరమానంద భవనమున**
**అనుమతించు శుభతరుణమెన్నడో - ఆశ అనే - 7**

**8. బంధాతీతుడు :** చర్యలన్నిటికీ అతడే కారకుడైనా, ప్రేరకుడైనా, వాటిలో తానున్నా, ఏదీ అంటనివాడు. తామరాకుపై నీటిబొట్టువలె ప్రవర్తించగలవాడు.

**నిత్యనిర్మల సహిత నిష్ప్రపంచపదార్థమును**
**నిర్విషయశుద్ధ నిర్వికారమును - పరమశివునికి ప్రణామం - 3**
**శుద్ధనిర్గుణ పరదైవమా! పరంజ్యోతి స్వరూపమా! - సుఖవార్ధి - 11**

సుఖవార్ధి శీర్షికలోని గీతాలన్నీ ఈ భావాలనే వ్యక్తం చేస్తున్నాయి.

**9. సర్వజ్ఞుడు :** జీవాత్మలన్నింటిలోను గల జ్ఞానంతో కలిసి ఉంటూ, వ్యక్తీకరణకు దోహదం చేసేవాడు. ప్రాణుల శరీరాలకు పంచభూతాలు ఆధారమైనట్లు వాటి జ్ఞానానికి పరమాత్మజ్ఞానం ఆధారం.

**జ్ఞానమునకు జ్ఞానమై ఆనందమయ దేవాధిదేవుడు**
**- పరమశివునికి ప్రణామం - 3**

జీవాత్మ జ్ఞానం దీపకాంతివంటిది. భగవంతుడి జ్ఞానం అనంతప్రకాశం వంటిది.

**చేతిలోన దివ్వె వెంట చని దర్శించునటుల**
**సత్యదీపము వెంట జని సత్తును గాంచుటెన్నడో - 1**
**ఆద్యంతరహితజ్యోతి ఆనందమున మిళితమై దీపించు టెన్నడో - 6**
**ఆకాశాది భూతములన్నిటిని తనలోన దాచి బట్టబయలై**
**- పదార్థవందనం -9**

**10. శివాజ్ఞ:** శివాజ్ఞలేనిదే చీమైనా కుట్టదని సామెత. కనుక పరమాత్మ ఆజ్ఞ అనుల్లంఘనీయం. సమస్త బ్రహ్మాండాలను నడిపిస్తున్నవాడు అతడు. విశ్వరచన ఆయన చర్యే

**అతడులేక అణువేనియు చలింపదు - సర్వవ్యాపక పదార్థం - 1**
**సర్వము నీ యధీనమె. అన్నియు నీ సొంతమె**
**సకలమును నీ చర్యలె - కరుణాపయోనిధి - 3**

**11. దివ్యానుగ్రహం :** భగవదనుగ్రహమే ప్రపంచాన్ని నడుపుతూంది. ఆయన అనుగ్రహంతోనే బయలులో కోట్లాది బ్రహ్మాండాలు నిలిచి ఉన్నాయి. అనంతమైన బయలు పంచభూతాలు, వాటిచే రూపొందిన సమస్త వస్తుజాలానికి చోటునిస్తూంది. అన్నిటినీ తనలోన ఇముడ్చుకోగలదు కాన అది బయలు. బయలే పతి.

**ఆకాశాది భూతములు నీవేనని నుడివిన**
**వేదము, నన్నేల నీవని చెప్పదు తెలుపుమా పరాత్పరా! - 168**

దైవానుగ్రహం శుద్ధమాయకు అతీతం కనుక దానిని మాటలతో వర్ణించలేము. కాబట్టి అది మూగ బయలు.

**బీజరహితమైన పంటగలదొ! నీ దయలేక**
**భూతము లుండునా? చెపుమా! పరాత్పరా! - 73**

**12. దివ్యరూపం :** వ్యక్తమవుతున్న సర్వపదార్థాలలో భగవంతుడే దయారూపుడు. జ్ఞానస్వరూపుడు. సాకారనిరాకారుడు, ప్రణవస్వరూపుడు, పరమ సుఖస్వరూపుడు, సకలకల్యాణగుణ స్వరూపుడు, గురుస్వరూపుడు. అసంఖ్యాకమైన దృశ్యాదృశ్యరూపాలన్నీ ఆతడే. ఇక ఆయన దర్శించిన జీవాత్మ స్వరూపాన్ని పరిశీలిద్దాం.

* * *

## 6. ఆత్మచింతన

**వాలాగ్రశతభాగస్య శతధా కల్పితస్య చ ।**
**భాగోజీవః సవిజ్ఞేయః స చానన్తాయకల్పతే ॥ – శ్రీ శివగీతా 10 – 20**

వెంట్రుకకొనను వందభాగాలుచేసి, అందులో ఒకభాగాన్ని మరో వందభాగాలు చేసినట్లయితే అందులో ఒక భాగం వంటివాడు జీవుడు. అయినా అతడనంతుడు.

**పశువు**

పశువు అంటే జీవాత్మ. పాశంచేత బంధింపబడింది. శరీరంకానిది. సహజం కాని ఆణవమలంతో కూరుకు పోయింది. పాశంతో కట్టువడినప్పుడు సత్కర్మ దుష్కర్మల చేత జననమరణాదుల్ని కలిగించేది.

**పాశ తలపులు దూది వలె పరుగు లిడ జేసి**
**ఈశ! నను పాలింప దయ చూప రాదొ?**

పశుత్వాన్ని నశింపజేసి నాశనం లేని పరమశివుని పొందడం ఎన్నడోనని ఆచార్యులు పరితపించారు.

మహాత్ములు భగవద్గుణాలను విపులీకరించారు. కాని చర్మచక్షువులకు అవి గోచరం కావు. అతడు భావాతీతుడు. కనుక పతిని గురించి నాస్త్యస్తి భావాలు చోటుచేసుకున్నాయి. కాని పశువైన జీవాత్మ అలాకాదు. అది కళ్ళకు, కన్పించకపోయినా, భావానికి గోచరిస్తుంది. ప్రాణం ఉంది, ప్రాణం లేదు, ప్రాణం వచ్చింది – ఇటువంటి అభిప్రాయాలు జీవాత్మ ఉనికికి సాక్ష్యాలు. ఆచార్యులు తమ గీతాలలో జీవాత్మను గురించి పేర్కొన్న విషయాలను పరిశీలిద్దాం.

**1. జీవాత్మ లోపాలు :** జీవాత్మ పాశంచేత కట్టువడి నందున అనేక లోపాలు చోటు చేసుకున్నాయి. మహాత్ములు దోషరహితులు. అయినా తమలో అనేక

దోషాలున్నట్లు ఆపాదించుకున్నారు. వైష్ణవంలో దీనిని నైచ్యానుసంధానం (తనను తాను తక్కువగా, నీచంగా పరిగణించడం) అని అంటారు.

తాయుమానవర్ తమలో పలు బలహీనత లున్నాయని పేర్కొన్నారు.

**నీకై పూజ చేయలేదు, ఏకరూపుడవని అర్చింపనెంచిన**
**పూలనన్నింట నీవే నిండుగా, గోచరించితివి.**
**మంచుపూలకోయ మనసొప్పక, నమస్కరింతు మనిన**
**గుండెలో కొలువున్న నిను నుతింపసిగ్గగు.**
**అన్యమనస్కుడనై అవనతుడగుట సబబె? - కరుణాపయోనిధీ - 6**

**శిలయైనను కరగు నొకప్పుడు, నాదు రాతిగుండె**
**ద్రవింప దెన్నడు, నలువ ఇంతటి కఠినాత్ముడా! - సుఖవార్ధి -3**

సుఖవార్ధి అంటే ఆనందాన్ని కలిగించే సముద్రమని అర్థం. దైవం వెగటు పుట్టించని సుఖవార్ధి. పశువైన జీవాత్మ పతి అయిన భగవంతుడికి ఎల్లప్పుడూ దాసుడే. పాశంచేత కట్టుపడిన పశువే.

**2. జీవాత్మ - అహంకారం :** ఆశ్రయించిన పదార్థ స్వభావాన్ని ఆపాదించుకునే లక్షణం. జీవాత్మకుంది. అంటే ఆత్మ జ్ఞానమున్న పదార్థమేకాని దేని నాశ్రయించి ఉంటుందో దాని స్వభావాన్ని, ప్రతిఫలిస్తుంది. ఇందువల్లే జీవాత్మను 'స్ఫటికచిత్తు'గా పేర్కొంటారు.

స్ఫటికం తనకు చేరువుగా ఉన్న వస్తువురంగునే తనరంగుగా చూపుతుంది కనుక జీవాత్మ కా పేరు. కాని స్ఫటికం జ్ఞానంలేని వస్తువు. ఆత్మకు ఆశ్రయపదార్థ లక్షణం దృఢమైతే అజ్ఞానజనిత అహంకారబంధం నుంచి దానిని విడిపించడం అసాధ్యం. అందువల్ల ప్రపంచ బంధమే దాని స్వభావమని భావించాలి. జడబంధం ఆత్మకుంటే జడపదార్థాన్ని విడిచి భగవంతుణ్ణి ఆశ్రయించడం ఎలా? భగవంతుడైనా ఆ స్వభావాన్ని ఏ విధంగా మార్చగలడు?మార్చలేకపోతే భగవంతుడి పంచవృత్తులు నిరర్థకం అవుతాయి. కనుక ఆత్మస్వభావం

అహంకారంతో ఎల్లప్పుడూ అద్వైతంగా ఉండదు. అహంకారాన్ని నాశనంచేసే స్వభావం దానికున్నందున ఆచార్యులు జీవాత్మను 'బంధమడచు చిత్తునీవు' అని వర్ణించారు.

**మాయ వికారము నడచి శుద్ధావస్థను పొంది**
**అనుగ్రహమున ఆనంద నృత్యము చేయుటెన్నడో - 28**

పతివలె పశువు కూడ జ్ఞానమున్న పదార్థమైతే అహంకారబంధంలో చిక్కువడదు. మాయవలె జ్ఞానం లేనిదైతే జ్ఞానమున్న పతిని ఏనాడు చేరదు. కనుక ఆచార్యులు "జ్ఞానాజ్ఞానములు నీవుకావు" (ఆకారభువనం - 18) అని జీవాత్మను పేర్కొన్నారు.

**3. తిరోధానశక్తి:** మూడు మలాలతోబాటు తిరోధాన మాయేయాలను కూడ చేర్చి పంచ మలపదార్థాలని చెప్పడం ఉంది. తిరోధానమంటే కన్పించకుండా ఉండడం. అదృశ్యం, మాయమై కన్పించకుండా ఉన్నవాడు తిరోహితుడు.

**మమ్ములను, కర్మను, పతిని కన్పింపనీని**
**పతి తిరోధానము తొలగుటెన్నడో - 24**

జీవాత్మలైన మనల్ని, మనలను బంధించిన కర్మను, భగవంతుని తిరోధానశక్తి నుంచి బయటపడడం ఏనాడు జరుగుతుందో అని నిట్టూర్చారు.

**గజిబిజియైన తత్త్వ సముదాయమను చెత్తను**
**జ్ఞానాగ్ని దహించుట ఏనాడో - 26**

అయిదురకాల మలాలను సమూలంగా నశింప జెయ్యాలని, తత్త్వాలన్నిటికీ భిన్నమైన మన ఆత్మను తెలుసుకోవాలన్నది ఆచార్యుల ఆక్షాంక్ష.

**జడరూప వ్యర్థమును విడనాడి**
**భిన్నమగు చిత్తును గాంచుటెన్నడో - ఆత్మస్థితి - 2**

**కర్మేంద్రియ జనిత మాయచే వ్యర్థమై**
**కాలము గడువ సత్యమునెఱుగు టెన్నడో - 4**

తత్త్వాలన్నీ జడపదార్థాలే, జ్ఞానపదార్థం వాటికి భిన్నమైంది. ఇంకా పంచేంద్రియాలను ఆత్మ అని భావించే మూర్ఖత్వం నశించేదెప్పుడు (4) ఆకారాన్ని ఆత్మగా భ్రమించే అసత్యభావన మనల్ని విడిచి వేళ్లేదెప్పుడు (5), త్రిగుణాలనే జీవాత్మగా పరిగణించే అజ్ఞానాన్ని విడిచి భగవదనుగ్రహ సహకారంతో మనల్ని అర్థంచేసుకోవడం ఏనాడో? అని పలురకాలుగా తిరోధానశక్తి లీలల్ని ఆచార్యులు అభివర్ణించారు.

**4. ఆత్మలనేకం :** భగవంతుడు ప్రాణులలో ప్రాణమై ఉన్నాడన్నది సిద్ధాంత సత్యం. 'ఆత్మలో నాత్మయై నిరతము కొలువుందును' పరమాత్మ పదార్థం పతి అన్నదొక్కటే. కాని ఆత్మలు అసంఖ్యాకం. అందువల్ల అతడు ఏకమే, అనేకం కూడా.

**ఏకమనేక మా పరము చరణములకు మంగళము**
**అండమునై, పిండమునై అవధిలేని**
**ఆత్మలో నొక ఆత్మనై కొలువుంటిని – ఆశ అనే. 12** అని పేర్కొన్నారు.

**5. బహువిధ ఆత్మస్థితులు :** సంసారబంధం, పతిబంధంలేని చోట మనస్సు కేవల స్థితిలో ఉంటుంది. ఇందువల్ల ఆత్మ దేనినో ఒకదానిని ఆశ్రయించి ఉంటుందని ఆచార్యుల భావన. ప్రపంచాన్ని పతిని ఆశ్రయించని ఆత్మ అజ్ఞానాన్ని ఆశ్రయిస్తుంది. కనుక ఆత్మకు స్వయం వ్యక్తమైన స్థితి లేదని బోధపడుతుంది. ఆత్మ తనను ఎరిగితే భగవదనుగ్రహ సత్యాన్ని గ్రహించి, పతినే ఆశ్రయించి, ఉంటుందని ఆచార్యులు పేర్కొన్నారు.

కేవలస్థితి, సకలస్థితి, శుద్ధస్థితి, కేవలావస్థ, సకలావస్థ, శుద్ధావస్థ మొదలైన శైవసిద్ధాంతాలు చెప్పేవాటినన్నిటిని తాయుమానవర్ తమగీతాలలో పేర్కొన్నారు. ఆత్మజ్ఞానానికి అవరోధంగా ఉండేది మనశ్చాంచల్యం. మనోధర్మాల గురించి, మనోనిగ్రహాన్ని సాధించడం గురించి ఆచార్యులు విపులంగా తమగీతాలలో చర్చించారు.

* * *

# 7. మనోధర్మాలు

**మన ఏవ జగత్సర్వం మనఏవ మహారిపుః ।**
**మనఏవ హి సంసారో మన ఏవ జగత్త్రయమ్ ॥**

**– ఋభు గీత – 2 – 34**

మనస్సే సర్వజగత్తు. మనస్సే పరమశత్రువు. మనస్సే సంసారహేతువు. ముల్లోకాలూ మనసుకు స్వాధీనం.

సిద్ధాంతశాస్త్రం 24 ఆత్మతత్త్వాలను పేర్కొంటుంది. అవి జ్ఞానేంద్రియాలు అయిదు, కర్మేంద్రియాలు అయిదు, తన్మాత్రలు అయిదు, పంచభూతాలు అయిదు, అంతఃకరణాలు (మనోబుద్ధి చిత్తాహంకారాలు) నాలుగు. వీటన్నిటికి కారణమైన మూలప్రకృతి. ఇది సాత్త్విక, రాజస, తామసమనే త్రిగుణాలు కలది. స్థూలంగా బయటపడక, సూక్ష్మమై ఉన్నస్థితి మూలప్రకృతి. ఇది అవ్యక్తం. అవ్యక్తంగా కారణస్థితిలో ఉన్నందున దీన్నొక తత్త్వపదార్థంగా భావించడం లేదు.

**చిత్తం**

మూల ప్రకృతిలోని ఒక భాగంలో అవ్యక్తంగా, సూక్ష్మంగా ఉన్న త్రిగుణాలు స్థూలంగా బయటపడి తమలో సమంగా ఉండే స్థితి ఒకటుంటుంది. దాన్ని గుణతత్త్వం అంటారు. ఈ గుణతత్త్వం వల్లే ఆత్మను గురించి చింతించడానికి చిత్తమనే అంతఃకరణం పూనుకుంటుంది. ఈ వరకే పరిచయమైన దానిని మళ్ళీ మళ్ళీ మననం చెయ్యడం వల్ల సుఖదుఃఖాలు కలుగుతాయి. కనుక ఆత్మవేదనకు చిత్తమే కారణం అవుతుంది. మనస్సు చేత పరిశీలించదగిన ఏ పదార్థంలోనైనా చిత్తం ప్రసరిస్తుంది. అప్పుడు దాని వ్యాపకత్వాన్ని సముద్రానికి, దాని చర్యల్ని అలలకు, చిత్తమార్గంలో పయనించే ఆత్మను అలల తాకిడికి లోనైన గడ్డిపోచతోను ఆచార్యులు పోల్చారు.

**చిత్తమను రాకాసి తరంగాల కడలిలో పడి ఆటుపోట్లు**
**గను గడ్డిపోచవలె గాక, అనుగ్రహమొందుటెన్నడో**
**- ఏనాడో, తత్త్వశీలం - 10**

**దాసుడ నేను జలధి నిడిన గడ్డిపోచ భంగి**
**ఇటునటు పోటు వడుట ఇక యెన్నాళ్ళో పరాత్పరా - 36**

అటు ఇటు తిరగడమంటె అనేక జన్మలెత్తి అవస్థల పాలవడం.

**చిత్తము నెతిగిన వివేక మొందిన పదార్థ మగు**
**ఆనంద వార్థిని మునుక లిడు వైభవమెన్నడో- ఏనాడో, ఆనందస్వభావం- 10**

అని పెక్కు రీతుల వర్ణించారు.

**బుద్ధి**

గుణతత్త్వంలోని ఒక భాగంలో సాత్త్విక భావం ఎక్కువై నప్పుడు బుద్ధి అనే అంతఃకరణం బయటపడుతుంది. ఆత్మ అని సంశయించిన స్థితిలో ఇది ఇట్టిదని నిర్ణయించే కరణం. దీనికి సవికల్పజ్ఞానం (పేరు మొదలైన సంజ్ఞలతో ఉన్న జ్ఞానం) అని పేరు. సకల్పంగా గ్రహించే విశిష్టానుభూతి బుద్ధితత్త్వంలో కలగడంవల్ల అదే నిర్ధారింపబడిన వస్తువుగా పరిణమిస్తుంది. కనుక ఆత్మ ప్రత్యక్షంగా అనుభవించేది బుద్ధితత్త్వాన్ని కాని బాహ్యపదార్థాన్ని కాదు. కనుక జ్ఞానేంద్రియాల ద్వారా అంతరింద్రియమైన మనస్సు, తద్వారా బుద్ధిని ఆశ్రయించాలే గాని ప్రత్యక్షంగా ఆత్మానుభూతి చెందడం ఉండదు.

**సర్పకబళిత మండూకము భంగి బుద్ధీంద్రియ సందష్ట**
**బాధితుడనైన నను పరమపిత బ్రోచుటెన్నడో - తత్త్వశీలం - 8**

కారణంలో ఉన్నది కార్యంలోను ఉంటుంది. కనుక గుణతత్త్వంలో నుంచి వ్యక్తమైన బుద్ధితత్త్వంలోను త్రిగుణాలుంటాయి. బుద్ధిజనిత భావాలు ఎనిమిది. వాటిలో ధర్మ, జ్ఞాన, వైరాగ్య ఐశ్వర్యాదులు సానుకూలమైనవి. వాటి వ్యతిరేక

భావాలైన అధర్మ, అజ్ఞాన, అవైరాగ్య (ఆసక్తి) అనైశ్వర్యాదులు ప్రతికూలమైనవి. ధర్మాదిగుణాలు కార్యకారణ పద్ధతిలో క్రమంగా బయట పడి ఐశ్వర్యం కలగగానే అధర్మాలు చెడు గుణాల వైపు మళ్లుతుంది. అనైశ్వర్యం కలిగిన వెంటనే మళ్ళీధర్మం వైపు మొగ్గు చూపుతుంది. ఈ విధంగా చక్రంవలె పరిభ్రమిస్తూ భగవంతుడిని తెలుసుకోలేక ప్రపంచబంధాలలో చిక్కుకుంటుంది. ఇందువల్లే బుద్ధిని మచ్చులున్న పడగవిప్పిన పాముతో ఆచార్యులు పోల్చారు.

బుద్ధి వల్ల జ్ఞానం కలుగుతుంది. జ్ఞానం వల్ల అస్థిరమైన వాటిపై ద్వేషం కలుగుతుంది. ధర్మమార్గంలో ఉన్నందున సంపద కలుగుతుంది. సంపదవల్ల, గర్వం ప్రబలుతుంది. గర్వం వల్ల పాపకార్యాలు, అందువల్ల దుఃఖదారిద్ర్యాలు కలుగుతాయి. దుఃఖదారిద్ర్యాలు దరిచేరిన వెంటనే ధర్మజ్ఞానార్జనలవైపు బుద్ధి మళ్ళుతుంది. ఇలా భ్రమించడం వల్ల సుఖ, దుఃఖ మోహాది భావాలు కలుగుతాయి. పామునోటబడిన కప్ప తప్పించుకోవడానికి వీలుకానట్లు, బుద్ధిభ్రమణంలో చిక్కుకున్న ఆత్మ ఉన్నతిగాంచడం అసంభవమని తాయుమాన ఆచార్యులు విపులీలకరించారు.

పై వాటిలో సానుకూల భావాలు సాత్త్వికగుణం వల్ల ఏర్పడేవి. అవైరాగ్యం ఒక్కటే రజోగుణం వల్ల కలుగుతుంది. తక్కిన మూడూ తామసగుణంవల్ల ఏర్పడతాయి. సాత్త్వికగుణం కారణంగా సంతోషం, రజోగుణంవల్ల దుఃఖం, తామసగుణం ప్రబలడంవల్ల రెండూ లేని మోహస్థితి కలుగుతుంది.

**అహంకారం**

బుద్ధితత్త్వంవల్ల రజోగుణమున్న అహంకార తత్త్వం పుడుతుంది. నేను చెయ్యగలను అని ఆత్మ అహంకరించేట్లు చేస్తుంది. నేను, నాది అనే గర్వం కలగడంవల్ల, అహంకారాన్ని మదపుటేనుగుతోను, ఆత్మ దాని నోటిలోని చెరకు గడతోను తాయుమాన ఆచార్యులు పోల్చారు.

**అహంకార మదేభము నోట చెఱకుగడవోలె**
**తహ తహ చెందక తండ్రి ప్రేమ నొందుటెన్నడో - తత్త్వశీలం - 9**

మరోపాటలో అహంకార లక్షణాన్ని కింది విధంగా వర్ణించారు.

**అహమ్మను మానిషాద ఘోరపిశాచము**
**చేతైన ఆణవ రాక్షసి కంటె చెడుగొనర్చు**
**వివేకమును కబళించు, పారదర్శకతను తొలగించు**
**పదార్థమేదైనను నిందించు, దుర్భాషలాడు**
**హరిహరబ్రహ్మాదులతో సమమని భావించు**
**వేగముగ నేగు రథచక్రమం దిరుసు చీల వలె**
**నిశ్చలమైయుండు; లోకానసాటి నాకెవరనుచు**
**రావణాసురుని లీల ఎదురొడ్డి నిలుచు**
**హృదయగగనాన తనదైన రాజ్యమును నెలగొల్పు**
**ఇచ్ఛవచ్చిన రీతి నియంతయై పాలించు.**

.......................................................

అహంకారాన్ని కొబ్బరి పీచుతోను ఆచార్యులు పోల్చారు. టెంకాయ పిందెగా చిన్నదిగా ఉన్నప్పుడు పీచు దాన్ని రక్షించి పెరుగుదలకు తోడ్పడుతుంది. ఉపయోగానికి యోగ్యమైనప్పుడు పీచును తొలగించడానికి ఓ పరికరం అవసరం అవుతుంది. అలాగే అహంకారం ప్రాణుల తొలిదశలో ఎదుగలకు తోడ్పడుతుంది.

అహంభావం లేకుండా అల్పప్రాణాలు పురోగతిని సాధించలేవు. అహమంటే తానుకాని దానిని తానని భావించడం. క్రమంగా తనదికాని దానిపై బంధం దృఢమవుతుంది. టెంకాయనుంచి పీచును తొలగించడం శ్రమమైనట్లే, బంధం నుంచి బయటపడడం శ్రమ అవుతుంది. ఆత్మసాధకులు కఠోర పరిశ్రమ చేస్తేకాని బంధాలను విడిపించుకోలేరు. కాని దేహాత్మవాదులకు బంధాలు వాంఛనీయాలే.

అహం బలిమికి తాయుమానవర్ రెండు ఉదాహరణలు పేర్కొన్నారు. బోయవాడి రాతిగుండెను ఘోర పిశాచమన్నారు. పిశాచమైనా, బోయవాడైనా దయాదాక్షిణ్యాలు లేక ప్రవర్తిస్తారు. అహంకారాన్ని రావణాకారంగా పోల్చారు. భయంకరాకారుడే కాక క్రూరత్వం మెండుగా ఉన్నవాడు రావణుడు. మన కర్మేంద్రియ, జ్ఞానేంద్రియాలను విడివిడిగాను, కలిసికట్టుగాను ఉపయోగించే సామర్థ్యం కలవి. పదితలలుగలవాడు రావణుడు. వాటిలో ఎన్నిటినైనా బహిర్గతం చెయ్యగలవాడు. వాటిని నరికినా అవి కొత్తగా మొలకెత్తుతుంటాయి. అపరిమితమైన సామర్థ్యం కలవాడని సూచించడానికి ఇరవై చేతులున్నాయి. అహంకారం యొక్క మూర్ఖ బలిమికి అది నిదర్శనం.

జాగ్రత్, స్వప్న, సుషుప్త్యావస్థల్లోను అహం పాలన కొనసాగుతుంది. రావణరూపంగా అహాన్ని భావించినప్పుడు, అది ముల్లోకాలను శాసించగల ననుకొంటుంది. తనకు సాటి మరొకడు లేడని రావణుడు చెప్పుకున్నట్లే, అహంకారం పరిగణిస్తుంది.

**నేనను అహంకారము పుట్టు నందరి లోన**
**నది కృశింప జేయు, పెక్కు రీతుల లోకమాయ**
**ననుసరించి పరుగులిడు, నటుల పెరుగు**
**దుఃఖసాగరము నద్దాని దాట తరమే యేరికైన?**
**– ఆకారభువనం – 15**

**అహంకారం – ఆణవమలం**

తాయుమానవర్ పాటలు కొన్నింటిలో అహంకారాన్ని ఆణవమలంతో బాటు కలిపి పేర్కొనడం చూడవచ్చు. ఆయన ఆణవమలాన్ని సైతం రాక్షసిగా, క్రూర పిశాచంగా అభివర్ణించారు.

**దుష్ట పథమగు ఆణవ పిశాచము నణచి**
**భక్తశ్రేష్ఠులు నిను గొలుతురు పరాత్పరా! – 152**

మళ్ళీమళ్ళీ బంధమనే సంకెళ్ళను తగిలించేది ఆణవమలమే. అటువంటి ఆణవపిశాచానికి చెప్పేటప్పుడు కలుగుతుందోనని పరముని ప్రశ్నించారు.

**తాను పట్టిన పట్టును విడువక స్థిరపడు**
**ఆణవమును గొట్టి పారదోలు వారెవరో పరాత్పరా - 306**

ఆణవమల మంటే బ్రహ్మను, ఆత్మజ్ఞానాన్ని తెలియ నీయక అడ్డుపడే అహంకారం.

నేను భగవద్దాసుణ్ని. భగవదనుగ్రహం నాకున్నది అని అహంకరించడం వల్ల హాని కలుగదు. ఇది పక్వతగల, వాంఛనీయ అహంకారం. అపరిపక్వ అహంకారం వ్యర్థదంభం. అది పాశవశం చేస్తుంది. మనిషిలో అహం లేకపోతే క్రియాశూన్యత ఆవరిస్తుంది. సాత్త్వికాహంకారం, తైజసాహంకారం, రాజసాహంకారం, వైకారికాహంకారం, తామసాహంకారం, రాజసాహంకారం, భూతాధిక అహంకారమని వివిధ రకాలు.

**మనస్సు**

తైజసాహంకారం నుంచి పుట్టేది మనస్సు. వైకారికాహంకారం నుంచి జ్ఞానేంద్రియాలు ఆవిర్భవిస్తాయి. తామసాహంకారం నుంచి శబ్దస్పర్శరూప రసగంధాలనే తన్మాత్రలు ఉద్భవిస్తాయి. తన్మాత్రలు సూక్ష్మభూతాలు. పంచ భూతాలు స్థూలభూతాలు. పంచేంద్రియాల ద్వారా మనస్సు ప్రవేశించినప్పుడు ప్రపంచ బంధాలలో చిక్కుకుంటుంది.

**మన ఏవమనుష్యాణాం కారణం బంధమోక్షయోః**
**బంధాయ విషయాసంగి, ముక్త్యై నిర్విషయం స్మృతమ్.**

మనస్సే బంధమోక్షాలకు కారణం అవుతుంది. మనస్సు విషయాసక్తమైతే బంధానికి, నిర్విషయమైతే ముక్తికి కారణమవుతుంది.

తాయుమానవర్ మనస్సును మాయాతత్త్వంగా పరిగణిస్తారు. 'బలిమిని చూపే మాయ' (పరాత్పరా - 165)

మనస్సుకలవాడు మనిషి. ఎందరు మానవులున్నారో అన్ని మనస్సులున్నాయి. ప్రపంచ దృశ్యాలను చూసి, మనస్సు లెక్క లేనన్ని భేదాలను చూపగలదు. మనస్సును నిగ్రహించి ఏకోన్ముఖం చేస్తేనే "ఊరక ఉండే" సుఖాన్ని పొందవచ్చునని తాయుమాన ఆచార్యుల అభిప్రాయం. మనోధర్మాలను పరిశీలించి, అదుపులో ఉంచి ఊరక ఉండడానికి ప్రయత్నించారు. "తలపుల నడచి ఊరక ఉందు స్థైర్యమరిది" అన్నారు. మనస్సును ఏకోన్ముఖం చెయ్యాలని ప్రయత్నించినపుడల్లా దాని విజృంభణశక్తిని గ్రహించారు. మనోనిగ్రహం ఎంతకష్టమని అర్జునుడు పేర్కొన్నాడో అటువంటి అభిప్రాయాన్నే తాయుమానవర్ వెలిబుచ్చారు.

**చంచలం హి మనఃకృష్ణ, ప్రమాథి బలవద్దృఢమ్**
**తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్ – భగవద్గీత 6–34**

మనస్సు చంచలమైంది. క్షోభపెట్టేది (ఇంద్రియాలను) బలమైంది. దృఢమైంది. దాన్ని నిగ్రహించడం, గాలిని అణచి పెట్టడంకంటె మిక్కిలి కష్టం. ఆచార్యులు మరెన్నో ఉపమానాలతో మనోబలిమిని వర్ణించారు.

కట్టువడిన స్తంభాన్ని సైతం పెకలించ గలిగిన మదపుటేనుగును వశపరచుకోవచ్చు. ఎలుగుబంట్లు, పులులవంటి మృగాల నోళ్ళను మూయవచ్చు. సింహంమీద ఎక్కి సవారి చెయ్యవచ్చు. కఠోర విషసర్పాలతో క్రీడించవచ్చు. పంచలోహాలను నిప్పులోకాల్చి కరిగించి బంగారం (రసవాదం) చేసి, దానిని అమ్మి సంపద గడించి సుఖింపవచ్చు. దేవతల్ని అదుపులో ఉంచి ఊడిగం చేయించవచ్చు. బ్రతికినంత కాలం యవ్వనంతో ప్రకాశించవచ్చు. పరకాయ ప్రవేశం చెయ్యవచ్చు. నీళ్ళపై నడవ వచ్చు. నిప్పుపై దొర్లవచ్చు. అసామాన్యమైన అష్టసిద్ధుల్ని సాధించవచ్చు. కాని మనస్సును అదుపులో ఉంచడం అసాధ్యం. అని పలువిధాలుగా మనోబలిమిని గురించి వర్ణించారు.

**క్రోధమడచినను, సిద్ధుల పొందినను**
**మనసు నడప నెఱుగని వారికి నోరేలనో పరాత్పరా!**

మనస్సుతో సమరం అంతకఠినమైంది. తన లక్ష్యసాధనకు కష్టసాధ్యమైన పనికి సమాయత్తమయ్యారు తాయుమానవర్.

జననమరణాలు, స్వభావాలు, చర్యలు మొదలైనవాటిని (మనోసంబంధి) తమ అనుభవాల ద్వారా లోకానికి చాటారు. కర్మఫలం కారణంగా ప్రపంచ పదార్థాల పట్ల కలిగే బంధమే మనోరూపం దాల్చుతుంది. కర్మఫలంగా పుట్టి కలతచెంది, చంచలం కావడానికి, పంచేంద్రియాల తాకిడి కారణ మవుతుంది. అందువల్ల కలిగే ఇచ్ఛాద్వేషాలే జన్మలకు హేతువులవుతున్నాయి.

**కూడని ఇచ్ఛాద్వేషములు, వాని**
**దుర్లక్షణములు కలిగించు జననములు.**

ఆశ అనే పెనుగాలిలో దూది అనే మనస్సు చంచలిస్తూంది. మనసా 'ఊరకుండు'మని ఎన్నిసార్లు హెచ్చరించినా, పెడచెవిన పెడుతూంది. "బలవంతముగా గొడవకు వచ్చిన మల్లయోధుని వలె వాదించుచున్నావు" అని మనస్సును మందలించారు. మనస్సుకు ఆయన వాడిన విశేషణాల, రూపకాల ద్వారా ఆయన అభిప్రాయాన్ని గ్రహించవచ్చు. మనోమర్కటం, పైశాచికమనస్సు, మనస్సనే క్రిమి, మనోసర్పం, నేర్వని మనస్సు, చేటైన మనస్సు, నీచమైన మనస్సు, మాడి పగులుతున్న తలపులు, దూదిలా కొట్టుకుపోయే మనస్సు, మనస్సనే పాదరసం, మురికి మనస్సు, – ఇలా పలువిధాలుగా మనోచాంచల్య స్వభావాన్ని వర్ణించారు.

ప్రాణులలో మనిషి మనస్సే విశిష్టమైంది. పక్వస్థితిని అందుకున్నది. మనిషి మనస్సులో దేన్ని మననం చేస్తూంటాడో అదే అవుతాడు. 'యద్భావం తద్భవతి!' ప్రాపంచిక పదార్థాలతో బంధాలు ఆ విధంగా ఏర్పడతాయి.

భగవచ్చింతనతో ఉంటే భగవత్ స్వరూపుడవుతాడు. మనస్సు వ్యర్థ, అస్థిర పదార్థాలలో అనుసంధానానికి ప్రయత్నిస్తుంది.

**యతతోహ్యపి కౌన్తేయ పురుషస్య విపశ్చితః**
**ఇన్ద్రియాణి ప్రమాథీని హరన్తి ప్రసభం మనః - భగవద్గీత 2-60**

ఇంద్రియాలు మహాశక్తిమంతమైనవి. ఆత్మావలోకనం గురించి ప్రయత్నిస్తున్న విద్వాంసుడి మనస్సును సైతం అవి బలవంతంగా విషయాలవైపు మళ్ళించగలవు.

**బంధాలతో పలురకాలుగా పెనవేయబడిన నేను ఒకదానిని విడిచి, మరొక దానివైపు వెళ్లే క్రిమిలా ప్రవర్తిస్తున్నాను. నీవైభవాన్ని ఎన్నడూ కీర్తించి ఎఱుగను. అల్పజ్ఞుడను. ఎవరేమి చెప్పినా, దానివైపు మొగ్గు చూపే అస్థిరుడను. ఉదజఠరాగ్ని కొంత ప్రజ్వరిల్లినా, పొందిన అల్పజ్ఞానాన్ని సైతం విస్మరించి వదరుబోతు నవుతున్నాను. ఉన్మాదినవుతున్నాను.** అని ఆచార్యులు.

ఇంద్రియాల వెంట బడక భగవచ్చింతనలో నిమగ్నమైతే పరమా నందానుభవం కలుగుతుంది. అందుకు మనస్సనే అడవిలో సక్రమ మార్గం తెలుసుకొని బయటపడాలి. ఇంద్రియ అరాచకత్వాన్ని భరించలేక ఆచార్యులు దుఃఖించారు.

**కనులగాంచు పదార్థములన్నిట పరముడు గోచరించు...(పరాత్పరా - 12)**
**స్థితిని ఆశించారు.**

భగవచ్చింతన సర్వథా, సర్వత్రాకొనసాగడం వల్ల పరమాత్మదర్శనం సుకరమవుతుందని, అందుకు మంత్రోపదేశం చేసిన గురువును కూడ మానవరూపం దాల్చి పరమేశ్వరుడే వచ్చాడని భావించారు.

**బయలునకు బయలై అలరారు పరమునికి**
**పూజ చేయు విధము నెఱుగ జెపుమా పరాత్పరా! - 150** అని ఆదిదేవుని ప్రార్థించాడు.

**మర్కటస్య సురాపానం, తతోవృశ్చికదంశనమ్**
**తన్మధ్యే భూతసంచారః యద్వాతద్వా భవిష్యతి**

కోతి చంచలస్వభావం గలది. కల్లు తాగింది. ఆపై తేలుకాటు. దయ్యం కూడా ఆవహించింది. ఇక దాని ఆగడాన్ని వర్ణించడం సాధ్యమా! (తొలుతనె వానరమనే సుప్రసిద్ధ పద్యం తెలుగులో) ఈ భావాన్ని వ్యక్తీకరించే రెండు మూడు పద్యాలున్నాయి. అందులో ఒకటి. మనస్సును మర్కటంగా భావించి

**వృశ్చిక సందష్టమై గంతులిడు పిశాచమర్కటమౌ**
**వంచన మనమది నిలకడ గాంచు టెపుడో పరాత్పరా!**

మనస్సుకు అందనిది, మనస్సు ఎఱుగలేనిది పరమానందం. దైవానుగ్రహాన్ని ఆశించి సంపూర్ణంగా లీనమైతే, ఆ స్థితిలో ఆనందం మాత్రమే శేషిస్తుంది. కనుక పరమానందం మనస్సుకు అందనిదని అన్నారు. ప్రాపంచిక పదార్థాలను మనస్సు ఆశిస్తే పాశజలధిలో జీవిని పడవేస్తుంది. ఆ బంధాలను త్యజిస్తే తురీయ జీవితాన్ని అనుభవించవచ్చని "మనసు కోల్పోవ నిండైన తురీయజీవిత" మన్నారు.

నీటి బుడగ నీటిలో సంపూర్ణంగా తనరూపాన్ని కోల్పోయినట్లు, మనస్సు పూర్తిగా నశించాలని, వెలిగించిన కర్పూరం వలె కరిగిపోవాలని, పలుచోట్ల ప్రస్తావించారు. మనసెప్పుడు మరణిస్తుందోనని ఎదురు చూశారు.

అంతశ్శత్రువుగా ఉంటూ చేటు కలిగిస్తున్న మనోబలిమిని చూసి ఎలాగైనా దాని నణచివెయ్యాలని నిర్ణయించారు. కోపంతో "మనమా! నీ చెడు చర్యలనన్నింటిని విడిచి, నేను నుడివెడు హితము నాచరింపుము. నువ్విటుక్షణమైన నిలుకడలేక చరించడ మెందుకు? ఊరక ఉండు మని వేల పర్యాయములు హెచ్చరించితిని. దుష్టబుద్ధిని ప్రదర్శించెదవు. నువ్వు నశించెదవు. నిన్ను చంపి నా లక్ష్యమును సాధించెదను" అని తీవ్రంగా మందలించారు.

అహింసను నిరంతరం బోధించిన తాయుమానవర్ 'చంపుతాను' అనే మాటను వాడడం వల్ల ఆయనెంతటి క్షోభననుభవించారో బోధపడుతుంది. కాని మనస్సును అదుపులో పెట్టడానికి మనస్సే చక్కటి పరికరం. దాన్ని ఎల్లప్పుడూ పరిశీలించాలి.

మనస్సును జయించడానికి ప్రణాళికాబద్ధమైన ప్రయత్నం అవసరమని ఆచార్యులు గ్రహించారు. కృష్ణుడు అర్జునుడికి చెప్పినట్లు వైరాగ్య, అభ్యాసాలు తగిన సాధనాలుగా గ్రహించి పాటించారు.

* * *

## 8. కర్మప్రభావం

**అవశ్యమేవ భోక్తవ్యమ్ కృతం కర్మ శుభాశుభమ్ ।**
**కృతకర్మక్షయో నాస్తి కల్పకోటి శతైరపి ॥**

చేసిన పని మంచిదైనా, చెడ్డదైనా దాని ఫలితం తప్పక అనుభవించాల్సిందే. వందకోట్ల కల్పాలలోను కర్మఫలం అనుభవించిన తర్వాతే నశిస్తుంది.

ప్రాణులన్నీ ఆనందాన్నే కోరుకుంటాయి. అయినా అది దుఃఖాన్ని అనుభవించాల్సి ఉంటుంది. కొందరు ఏ పనికి పూనుకున్నా అందుకు తగిన అనుకూల పరిస్థితులు తమంతట తామే కలిసి వస్తాయి. కొందరికి స్వల్పవిషయాలకైనా అవరోధాలు ఎదురవుతాయి. ఒకే వ్యక్తికి కొంతకాలం సానుకూల పరిస్థితులు, మరికొంతకాలం ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయి. ఇందువల్ల పరిస్థితులే సుఖదుఃఖాలకు కారణమని తెలిసినా, ఆ పరిస్థితులు కలగడానికి మరోకారణం ఉందని బోధపడుతుంది.

సంపదలు, భోగాలు బాహ్యజీవితానికి సంబంధించినవి. అంతరంగ జీవితంలో జ్ఞానం, వినయం, శీలం, తృప్తి మొదలైనవి ఉంటాయి. మూలకర్మ అంతరంగ జీవితానికి సంబంధించి ఆయా జీవులకు స్వాతంత్ర్యాన్నిస్తుంది. బాహ్యజీవితానుభవానికి మూలకర్మ సానుకూలంగా సహకరిస్తే తప్ప అనుకున్నవి పొందలేము.

**కోర్కెలెల్ల మదిని కోరినట్లగు గాన**
**తపము జేయుటొప్పు ధరణియందు. – తిరుక్కుఱళ్. 265**

తపం చెయ్యడం అంటే సత్కర్మాచరణ అవుతుంది. జ్ఞానంకావాలని ఆశించి ప్రయత్నించినవారు, అనాసక్తత వృద్ధి చెందాలని కోరినవారు దైవానుగ్రహపాత్రులయ్యారు.

**మూలకర్మ**

ఆణవమలంతో పెనవేసుకున్న ఆత్మ ప్రపంచంతో సంబంధం కలిగినప్పుడు, ఆయా పదార్థాలపట్ల బంధం పెంచుకుంటుంది. ప్రపంచం వైపు మనస్సు మొగ్గే చర్యలున్నంతకాలం దుఃఖం తొలగదన్న సత్యాన్ని ఇలా పేర్కొన్నారు.

**తరచి చూచి తేటపడని కలతల తొలగునటులు**
**పూర్వకర్మలనే వేరును పెకలించుట ఏనాడో! - తత్త్వశీలం - 18**

**ద్వంద్వకర్మ పైబడిన దీనాడో! నేను పుట్టినపుడె**
**వచ్చినవికదా! వాటినెల్ల నే విడుచుటెటులొ/పరాత్పరా - 160**

నేనీ ప్రపంచంలో అడుగుపెట్టిన రోజే కర్మకూడ పుట్టింది. నేను అంటే అహంకారమని అర్థం. అహంకారం జనించినప్పుడు కర్మపుడుతుంది. "కర్మకు కారణమైన తలపు కలగడానికి ముందు నాకో తలపు పుట్టి ఉండాలి కదా! మరి నాకా తలపుకలగడానికి ముందు నేను చేసిన కర్మ ఏది? ప్రశ్నించారు.

**నిను గురించి తలపులేకున్న, పూర్వమున**
**నేను చేయుటకు కర్మలేవి! పరాత్పరా! - 161**

పై అభిప్రాయాన్నే మరికొన్ని చోట్ల కూడ ప్రస్తావించారు.

**తండ్రీ! మంచి చెడులు నిర్ణయించ జాలని**
**నేను చేయు కర్మలకు నీవు చేర్చుచోటేది! పరాత్పరా! - 163**

**పొంగి పొరలు నీ అనుగ్రహమును నిండుగ పొందిన**
**సూర్యుడెటు ఉదయించినను భయమేల? పరాత్పరా - 141**

తండ్రీ నేను చేసిన పనులంటూ ఏవీలేవు. అయితే పూర్వకర్మ (సంచితకర్మ), ప్రారబ్ధకర్మ మొదలైనవి నాకెలా ప్రాప్తిస్తున్నాయి?

కాయం అంటే శరీరం. కాయం ఉల్లిపాయ వంటిది. ఉల్లిని వలుస్తున్నప్పుడు ఒక్కొక్క పొరగా తొలగి చివరకు ఏమీ మిగలదు. అనేక శరీరాలను ధరించి పలుజన్మల కర్మానుభవం పొందిన తర్వాత మిగిలేది శూన్యమే కదా!

పరమాత్మా! నా జ్ఞానాన్ని, నన్నూ, చెడిపే కర్మను చెరచి అథముడినైన నన్నుద్ధరించరాదా! అందువల్ల కలిగే పుణ్యం నీకే చెందుతుంది కదా! ఇలా పలురీతుల ఆచార్యులు వేడుకున్నారు.

భగవంతుడు అన్నిచోట్ల నిండి ఉన్నాడు. అతడి దయను కోరి పరితపించిన వారికి కర్మ ఎంత వేగంగా ప్రసరించినా, ఆ వేగం నిరోధింప బడుతుంది. "పరమేశా! నిన్నే ఎల్లప్పుడూ తలచుకుంటూ, నీ దయనే ఆశిస్తున్న నాపై కర్మాధిక్యత ఎలా కలుగుతుంది?" అనే భావం ఆయన రచించిన పెక్కు గీతాలలో కన్పిస్తుంది?" తీవ్ర వాంఛతో దైవానుగ్రహాన్ని ఆశించిన వారికి 'సర్వసమర్థమైనది కర్మ' అనే భావం కలిగే అవకాశం లేదు. అది నశిస్తుంది. అంతటి తీవ్రవాంఛ తనలో కలగాలని, పరిపూర్ణుడైన పరమాత్ముడికి విజ్ఞప్తి చేశారు.

**నా వదనమును గాంచవొ! చూచి నా వెతను**
**తీర్చవో! వాయి తెరచి నుడువరాదొ! పరాత్పరా!**
**చెడు తలపుల తలచి తలచి పేదగుండె**
**వ్రణము చేసినదైన వైన మిక చాలు పరాత్పరా!**

ఇలా విజ్ఞప్తి చేసి సానుకూలంగా ఇలా అంటారు.

**కర్మమేది? ఘోరనరక మొందు టేది?**
**పునర్జన్మ ఏది? నామనోరథము నీడేర్చు**
**ముక్కంటి కరుణ మిక్కుటమై నాపై నుండ**
**....................కాంతాకనకాలు - 49.**

నాథుడుండ మనకేల భయము? అతడే కదా మనకభయుడు' అనే అభిప్రాయాన్ని పై పాటద్వారా చాటారు.

లెక్కలేనన్ని తలపులు జనించినట్లే లెక్కలేనన్ని జన్మలు కలుగుతాయి.

**సముద్రములెన్ని? కొండలెన్ని?**
**కర్మవాసనలన్ని - అందుకైన**
**శరీరములెన్నెన్నొ! కడలి తీరమందలి**
**ఇసుకరేణువుల నొప్పునవి.**
**నేటికాయమును విడువక ముందె**
**అంధకారమును అదలించరాదొ పరాత్పరా!**

ఏ చర్యలు మనస్సులో, సుఖదుఃఖాలుగా ముద్రింపబడతాయో, అవి కర్మలుగా నెలకొంటాయి. వీటిని సంస్కారాలు లేదా వృత్తులని పేర్కొంటారు. సంస్కారాలుగా మనసులో ముద్రితమైన కర్మలు మళ్ళీ రూపం దాల్చి దరి చేరుతాయి. ధ్యానానికి కూర్చున్నప్పుడు అవి శరపరంపరగా గోచరిస్తాయి. వీటిని తొలగిస్తూ ఉన్నా అనేకవృత్తులు ఎడతెగకుండా వస్తుంటాయి. అందువల్లే ఆచార్యులు 'దుష్టకర్మలు యుద్ధం ప్రకటిస్తున్నాయి' అని అంటారు.

యుద్ధంలో విజయం సాధించాలంటే పరాత్పరుని అనుగ్రహం కావాలి. దాన్నే దృఢంగా ఆచార్యులు విశ్వసించారు.

**అశివా పాశసంయుక్తాః పశవః సర్వచేతనాః యస్మాద్**
**విలక్షణాస్తే భ్యస్తస్మాదీశఃశివః స్మృతః - శివోపనిషత్తు.**

పాశసంయుక్త పశుతుల్య అశివ జీవుడికి పాశవిముక్తి నిచ్చే ఉపాసనే శివోపాసన.

* * *

## 9. పవిత్రాద్వైతం

**అచిన్త్యరూప మవ్యక్త మనన్త మమృతం శివమ్**
**ఆదిమధ్యాన్తరహితం ప్రశాంతం బ్రహ్మకారణమ్ - శ్రీశివగీతా - 11-44**

ఊహించడానికి శక్యం కానివాడు. అనంతుడు. అమృతరూపుడు. నిత్యమంగళుడు. ఆదిమధ్యాంతరహితుడు, ప్రశాంతుడు. బ్రహ్మకారకుడు.

ఈశ్వరుడికి ప్రపంచంతో ఉన్న సంబంధాన్ని వివరించడానికి తాయుమాన ఆచార్యులు అద్వైతమనే పదాన్ని వాడారు. అద్వైతమంటే రెండవది లేనిది, ఎడబాటులేనిదని అర్థం. ఎడబాటు లేనిదనగానే రెండు పదార్థాలు ఉన్నట్లే. అవి రెండైనా విడివిడిగా లేకుండా కలిసే ఉంటుందని బోధపడుతుంది. అద్వైతంలో భేదం, అభేదం, భేదాభేదం అనే మూడు అంశాలున్నాయి. ఈ మూడింటికి అతీతమై ఉండడాన్ని వేదం అద్వితీయం అంటుంది.

పరమాత్మ, ప్రపంచం కలిసి ఉన్నప్పటి స్థితిని చూస్తే రెండూ ఒక్కటేనని వ్యవహరించే తీరున అభేదంగా ఈశ్వరుడు గోచరిస్తాడు. పదార్థ స్వభావాన్ని పరిశీలించినప్పుడు పరామార్థస్వభావం, ప్రపంచ స్వభావం భిన్నంగా కన్పించడం వల్ల ఈశ్వరుడు భేదంగా వ్యక్తమవుతాడు. పరమాత్మ ప్రపంచాన్ని క్రియాశీలం చెయ్యడంతోబాటు, తానూ క్రియాశీలమై ఉన్నా, ప్రపంచం వలె కాక నిర్వికారంగా ఉండడం వల్ల అభేదంగా ఉంటూ భేదమయ్యే భేదాభేదస్థితిని చూడ గలుగుతున్నాం. ఈ మూడింటి సాధారణీకరణ స్థితిని మెయ్‌కణ్డార్ అనే సిద్ధుడు 'అవియే తానై' అనే చిన్న మాటలతో చిరుదీపకాంతితో దర్శింపజేశారు. దీనిని క్షుణ్ణంగా అవగాహన చేసుకున్న తాయుమానవర్.

**అసత్యవాదులు గానని పవిత్రాద్వైతస్థితిని గాంచిన**
**మెయ్ కందార్‌నాథుని అనుగ్రహమందు టెన్నడో**
**- గురుపరంపర వందనం - 4**

అని వివరించడం ద్వారా మరింత స్పష్టమవుతుంది.

అభేదవాదులు తమ సిద్ధాంతాన్ని నెలకొల్పడానికి బ్రహ్మ కేవలం అద్వైతం అని అద్వైతమనే పదంతో బాటు కేవల మనే మాటను చేర్చి వ్యాఖ్యానిస్తారు. అందువల్ల వారి సిద్ధాంతం కేవలాద్వైతమవుతుంది. భేదాభేదవాదులు బ్రహ్మం విశిష్టతవల్ల అద్వైతమని, విశిష్టమనే పదంతో చేర్చడంవల్ల విశిష్టాద్వైతమని వ్యవహరించారు. మెయ్‌కండార్ తమ సిద్ధాంత ప్రతిపాదనకోసం అద్వైతపదంతో మరేపదాన్ని వాడకపోవడంవల్ల ఇతరులు ఆయన సిద్ధాంతాన్ని శుద్ధాద్వైతమని వ్యవహరించారు. ఆచార్యులు శుద్ధాద్వైతమనే దాన్నే పవిత్రాద్వైతం (పునిదమాన అదువిదమ్) అని తమ రచనల్లో వాడారు.

ఆచార్యులు అద్వైతాన్ని వివరించిన విధానం.

**సూర్యతేజమందు చంద్రకాంతి అడగునట్లు**
**శివుని దివ్యచరణఛాయలో నొదుగుటెన్నడో - 4**

దినకరుని కాంతిలో చంద్రకాంతి లీనమైనట్లు పరమాత్మతో ఆత్మ లీన మవడం గురించి ప్రస్తావించారు.

**ఆకాశమందడగు వాయువు భంగి**
**సచ్చిదానందరూపునిలో అణగుటెన్నడో - 5**

**నీటిలోన లవణమురీతి భగవత్కకరుణజనిత**
**జ్ఞానానంద వార్ధిలో కరగుటెన్నడో - 6**

**అమలిన జ్ఞానానందుని తేజస్సులోన**
**నిప్పున ఇనుముభంగి చేరుటెన్నడో - 7**

ఇంకా నీటిలోన నీడ, పట్టపగలందు కాంతి, స్ఫటికం, మొదలైన ఉపమానాలలో శివుని దివ్యచరణాల ఛాయలో కలిసిపోవడం అద్వైత స్థితిగా పేర్కొన్నారు. త్రిపుటుల గురించి ప్రస్తావించారు. ద్రష్ట, దర్శన, దృశ్యాలు శివునిలో అభేదస్థితినందుకున్నవారికి ఏకమై ద్యోతకం కావడం గురించి వర్ణించారు.

**మౌనస్థితి (మాటలుడిగిన స్థితి)**

ఏ పదంతోను భగవదనుభూతిని వర్ణించలేని స్థితి. ఇదే మౌనస్థితి. మౌనజ్ఞానావధిలో నిశ్చేష్టుడై ఉండడం ఊరక ఉండే స్థితి. అద్వైతం లేదా మౌనం లేదా ఊరక ఉండే స్థితులన్నీ ఒకే అర్థాన్ని సూచిస్తాయి. చిన్న చిన్న మాటలతో పలు నిగూఢ వేదాంతరహస్యాలను చెప్పడం ఆచార్యుల శైలి.

'అది' అయిన అది అయ్యేదను
అదియే తెలియ జేయు.

పై పాదంలో తొలి 'అది' అద్వైతభావనను, రెండవ అది శివాన్ని, మూడవది శివానుభవాన్ని సూచిస్తుంది. దీనికి తర్వాతిపాటలో అద్వైత జ్ఞానమైన మౌనం కాక మోక్షానందం పొందే మార్గం మరొకటి లేదన్నారు. 'అది' అంటే ఏమిటనే ఆశంక కలగవచ్చు. అందువల్ల అది అనే భావనను పూర్తిగా తొలగించి మధువు నాస్వాదించిన తుమ్మెదలా జనకాది చక్రవర్తులు, శుకాది మహర్షులు పరమానందానుభూతిలో నిశ్చలంగా జీవించారని పేర్కొన్నారు. ఈ అనుభూతిని గురించే అనేక పర్యాయాలు తమగీతాల్లో పేర్కొన్నారు.

**నిరాకారమై, మనసు దరిచేరని మార్గమై,**
**నిరోధ మెఱుగని ఆనందమై, నాశరహిత**
**మోక్షమై పరగు మౌనస్థితి.....**
**అద్వైతమగు ఐక్యానుభవమదియే శుద్ధస్థితి పరాత్పరా! - 293**

**జ్ఞాననిష్ఠ**

వ్యక్తపరచలేని ఆదిపురుషుని వ్యక్తపరచ గలది జ్ఞాననిష్ఠ అని ఆచార్యులు

**మనోవాక్కర్మలచే నెఱుగలేని పూర్ణజ్ఞాన**
**స్థితిలో నిలుకడగా నుండు టెన్నడో - 3**

**నిర్వికారనిష్ఠ కాక నీ దాసుడనగు నాకు**
**మరొక వాంఛ గలదొ! నీ కెఱుకయె గదా పరాత్పరా! - 51**

అజ్ఞానం అంధకారం వంటిది. జ్ఞానం కాంతి వంటిది. వెలుతురు వస్తేకాని చీకటి తొలగనట్లు జ్ఞానం వస్తేకాని అజ్ఞానం తొలగదు. జ్ఞానం చేతనే మోక్షం కలుగుతుందని చతుర్వేదాలు, పురాణ, ఆగమాదులన్నీ ఘోషిస్తున్నాయని తాయుమానవర్ ఘంటాపథంగా చెప్పారు.

జ్ఞానం ముక్తికి సులభమార్గం. దీన్నే పతిజ్ఞానమని, శివజ్ఞానమని శైవసిద్ధాంత గ్రంథాలు ప్రకటించాయి. శ్రవణ, పఠన, చింతన, నిస్ఠాదులచేత జ్ఞానం కలుగుతుంది.

**శ్రవణాది నాలుగు సుపథముల సాధనచేయ**
**బుద్ధినాలో పొడముటెన్నడో....**
**జ్ఞానమది తొలగినను త్రిపథములచే గల్గు**
**ముక్తి లభించుటది ఎన్నడో -** అని తమ లక్ష్యాన్ని నిర్దేశించారు.

సాలోక్యం, సామీప్యం, సారూప్యం, సాయుజ్యమనే నాలుగు మోక్ష స్థితులలో తొలి మూడింటి గురించి త్రిపథాలుగా ఆచార్యులు పేర్కొన్నారు.

అద్వైతస్థితికి భగవదారాధనా పద్ధతులైన ఇతర సంప్రదాయాలకు గల సంబంధం 'నేను' పైనే ఆధారపడి ఉంటుంది. ఆ 'నేను' సమూలంగా నశిస్తే అది పవిత్రాద్వైతం.

* * *

## 10. ఆరాధనా పద్ధతులు

**పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి**
**తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః - భగవద్గీత 9 - 26**

పరిశుద్ధాంతఃకరణుడైన భక్తుడు నాకు సమర్పించిన ఆకునుకాని, పువ్వునుకాని, పండునుకాని, నీటినికాని నేను స్వీకరిస్తాను.

**భగవదారాధన**

భగవదారాధన అంటే భగవంతుణ్ని పూజించడం. ధ్యానించడం. సర్వమతాలలోను ఏదో ఒక రూపంలో భగవదారాధన కన్పిస్తుంది.

జన్మలు అసంఖ్యాకం. జన్మ ఏదైనా సముద్రం వంటిది. అది అంధకార జలధి, దుఃఖజలధి. ఈ జన్మ జలధిని దాటడానికి యోగ్యమైనది మానవజన్మ. మానవజన్మ పంచేంద్రియ జ్ఞానంతోబాటు మనోజ్ఞానం కూడా కలిగి ఉంది. మనోజ్ఞానాన్ని తెప్పగా చేసుకొని జన్మజలధిని దాటి భగవదనుగ్రహంలో లీనం కావాలి. అందుకు తగినది మానవజన్మ. అందువల్లే తాయుమానవర్ "అనంతమైన జన్మలలో అరిది అరిది మానవజన్మ." అన్నారు. మనోజ్ఞానం ఇతర ప్రాణులకు ఉండదు. ఒకసారి మానవజన్మ పొందిన పిదప మళ్ళీ మళ్ళీ లభ్యం కాకపోవచ్చు. ఆ కారణంగా 'ఈ జన్మ తప్పిన ఏ జన్మ కల్గునో?" అని ముక్తికై ఈ జన్మలోనే ప్రయత్నించాలని ఉద్బోధించారు.

"అందమైన చేతులతో పూలు చల్లి, శరీరము పులకరించగా, ప్రేమతో మనసు ద్రవించగా, అశ్రువులు ఏరై ప్రవహించగా, వెగటుకలగని మోక్షావేశము తోడ ఆశయను జలధిలో మునిగి డగ్గుత్తికతో శంకరా! శంభో! స్వయంభూ! అని నుతించు సన్మార్గపద్ధతి....గురించి తాయుమానవర్ బోధించారు.

భగవంతుణ్ణి పూజించడం సత్కర్మలలో శ్రేష్ఠమైంది. పువ్వు హృదయానికి సంకేతం. అంటే హృదయాన్ని భగవంతుడికి సమర్పించడం. ఈ స్థితిలో శరీరం ఆనందంతో పులకాంకిత మవుతుంది. మనస్సు ప్రేమతో ద్రవిస్తుంది. కన్నీళ్లు

నదిలా ప్రవహిస్తుంది. ముక్తి మీద కాంక్ష కలుగుతుంది. అది ఆవేశంగా మారుతుంది. మాటలు తడబడతాయి. ఆ సందర్భంలో శివనామాలు వెలువడతాయి.

భగవంతుడికి, భగవన్నామానికి భేదంలేదు. నామస్మరణతో, భజనతో భగవంతుని నమస్కరించడం సన్మార్గపద్ధతి అని ఆచార్యులు పేర్కొంటారు.

**సాకార ఆరాధన**

ఆరాధనకో రూపం కావలసినందున ఆచార్యులు ఈవిధంగా సూచించారు.

**మూర్తి, క్షేత్ర, తీర్థములు క్రమముగా గాంచువారికి**
**సద్గురూపదేశ మవశ్యము లభ్యమగు పరాత్పరా! - 156**

అని చెప్పడం వల్ల శివుణ్ణి సాకారంగా పూజించడం, పవిత్రతీర్థాలలో స్నానం చెయ్యడం, క్షేత్రాలను దర్శించడం తపస్సుగా పరిగణించారు.

ప్రేమ ప్రాతిపదికగా రూపొందిన శైవ మతశాస్త్రాలు ముక్తి పొందడానికి మార్గాలను, ధర్మాలను నిర్దేశించాయి. నాస్తికులు ఇహలోకంలో భోగాలు అనుభవించడమే ముక్తి అని పేర్కొన్నారు. కొన్ని మతాలు పుణ్యలోకాలనుపొంది సుఖాలు అనుభవించడమే ముక్తి అని ప్రస్తావించాయి. తాయుమానవర్ జ్ఞానం పొంది శివ పదారవిందాలను చేరడమే ముక్తి అని అంటారు.

శివాగమ పద్ధతిలో చూపిన ఆరాధనా మార్గాలు నాలుగు. అవి చర్య, క్రియ, యోగం, జ్ఞానం. సాకార దైవారాధనకు కావలసిన వస్తువుల్ని సమకూర్చి దూరం ఉంటూ చేసే సేవ చర్య. శివలింగం దరిచేరి సదాశివుని మంత్ర, క్రియ, భావన (మనోవాక్కర్మలు) మూడింటితో అంతరంగంలోను బ్రాహ్మంలోను ఔపచారిక భావనతో చేసే పూజ క్రియ. ప్రపంచ వస్తువులతో ఎల్లప్పుడూ సంబంధం కలిగిన అంతఃకరణాలను వాటివైపు మరల్చక భగవంతుడి వైపు మరల్చడమే యోగం. పై మూడూ జ్ఞానం పొందడానికి సోపానాలు. ముక్తి పొందడానికి జ్ఞానమొక్కటే మార్గం.

చర్యలో ఉన్నప్పుడు భగవంతుడు మనకు యజమాని. మనమాయన సేవకులం. దీనిని దాసమార్గం అంటారు. చర్య నుంచి ప్రగతి గాంచినప్పుడు పరమాత్మ మనకు తండ్రి. మనం సంతానమవుతాం. దీన్ని సత్పుత్రమార్గ మంటారు. అంతకుమించిన పురోగతిలో భగవంతుడు మిత్రుడు. దీన్ని సహమార్గమని పేర్కొంటారు. అన్నిటికంటె పై స్థాయి జ్ఞానం. దీన్ని సన్మార్గమని వ్యవహరిస్తారు. ఇప్పుడు జ్ఞానికి భగవంతుడికి మధ్య సంబంధం నాయికానాయక సంబంధం. భార్యాభర్తల అనుబంధం. జ్ఞాని, భగవంతుడు ఐక్యస్థితిలో ఉంటారు.

పై నాలుగు మార్గాల ద్వారా లభ్యమయ్యే మోక్షస్థితులను ఇలా పేర్కొంటారు. చర్య – సాలోక్యపదవి. క్రియ – సామీప్యపదవి; యోగం – సారూప్యపదవి; జ్ఞానం – సాయుజ్యం – పై అన్ని పద్ధతుల ద్వారా భక్తులు ముక్తిని సాధించగలరని బోధపడుతుంది. పై నాలుగు మార్గాలను తాయుమానవర్ ఈ విధంగా పోల్చారు. చర్య – మొగ్గ; క్రియ – పుష్పం; యోగం – కాయ; జ్ఞాన – ఫలం.

శివలింగాన్ని పూజించేవారు ఆత్మశుద్ధి, స్థలశుద్ధి, మంత్రశుద్ధి, రూప శుద్ధి, క్రియాశుద్ధి అనే అయిదురకాల శుద్ధుల్ని పాటించాలి.

**పంచశుద్ధి చేసి నినుభావించి పూజింప**
**మించిన జ్ఞానము లభ్యమగు పరాత్పరా! – 154**

ఇది బాహ్యారాధన. అంతర ఆరాధనను అంతర్యామి పూజగా వ్యవహరిస్తారు. ఈ ఆరాధనలో మనసునే ఆలయంగా, చింతనను సుగంధంగా, ప్రేమను తిరుమంజన ఆరాధనగా భావిస్తారు. నిరంతరం భగవంతుని దివ్యగుణకీర్తన చెయ్యడం శ్రేష్ఠమని ఆచార్యుల అభిప్రాయం.

**శివభక్తుల ఆరాధన**

భగవంతుడి కంటె భక్తులకు సేవ చెయ్యడాన్ని ఆళ్వార్లు, నాయనార్లు, ఇతర భక్తకవులు గొప్పగా పరిగణించారు. తాయుమానవర్ కూడ తన్ను

గురించి చెబుతూ భగవంతుణ్ణి ఇలా ప్రార్థించారు. "పరాత్పరుని సదాచారపద్ధతిలో ఆరాధించడంలో విఫలుణ్ణి అయ్యాను. ముక్తికైన ధర్మమార్గాలను పాటించలేదు. భగవద్దాసులకు సేవ చేసే బుద్ధి కలవాణ్ణి. కనుక పరమేశ్వరా! ఆ సేవను పరిగణించి నన్నుద్ధరించుమా అని ప్రార్థించారు. మరొకగీతంలో –

**భక్తుల సేవ యొనర్ప – పరమానందస్థితి**
**తనంతట తాను దరిచేరు నందురు పరాత్పరా** అని పేర్కొన్నారు.

**పూర్వాచార్యుల ఆరాధన**

ఆచార్యులు ప్రఖ్యాతులైన శివసాయుజ్యం పొందిన పూర్వాచార్యులను శివయోగులను బహుధా కీర్తించారు. సృష్టి ప్రారంభ కాలంలోని వారైన బ్రహ్మమానస పుత్రులు సనకాదులను, ఇతిహాస కాలం నాటి శుకబ్రహ్మర్షిని దైవసమంగా భావించి నతులొనర్చారు. తమిళంలో ప్రఖ్యాతి గాంచిన శివాచార్యులను స్తుతించారు. వారు కేవలం ఆధ్యాత్మిక మార్గ నిర్దేశకులే గాక మహాకవులు కూడా జ్ఞానసంబంధర్, అప్పర్, సుందరమూర్తి, మాణిక్యవాచగర్, తిరుమూలర్, పట్టినత్తార్, పత్తివిగిరియార్, అరుణగిరినాధర్ మొదలైన వారి గీతాలను చక్కగా అధ్యయనం చేశారు. వాటి అధ్యయనంలో లీనమై పరవశించారు. వారిపై భక్తిభావంతో కీర్తించడమేకాక, వాని గీతాలను కొన్నిచోట్ల అనుకరించారు.

తమిళనాట ఇతర మతాలు విజృంభించిన కారణంగా అప్పటికి కొంత స్తబ్ధంగా ఉన్న శైవమతాన్ని పునరుద్ధరించడానికి విశేషంగా శ్రమించిన వాళ్ళు నలుగురు. వాళ్ళు తిరుజ్ఞానసంబంధర్, తిరునావుక్కరసర్, సుందరమూర్తి, మాణిక్యవాచగర్. వీళ్ళలో తొలి ముగ్గురి తమిళభాష మధురాతి మధురమని తమిళపండితుల అభిప్రాయం. తాయుమానవర్ కూడ వాళ్ళని కీర్తిస్తూ, "ముప్వురి మధురమైన తమిళభాషకు మురిసిన నీ చెవులు ఈ మూఢుని గీతాలను స్వీకరించగలవా?" అని వినయంగా పేర్కొన్నారు.

**యోగమార్గం**

యోగాభ్యాసం సర్వులకూ శిరోధార్యమైనా, సన్యాసం స్వీకరించిన వారికి ముక్తినందుకోవడానికి అనువైన మార్గం. వాళ్ళు ఏకాంతంలో మౌననిష్ఠను కొనసాగించి, శారీరక సిద్ధిని సాధించి (శరీరం ఖలు ధర్మసాధనమ్) ముక్తస్థితిని అందుకోవచ్చు. తాయుమానవర్ మౌననిష్ఠలో సాధించిన పరిపక్వతవల్ల పొందిన ప్రశాంతత సన్యాస జీవితంలోను కొనసాగింది.

పల్లె స్త్రీ నీటికుండను తలపై పెట్టుకొని, రెండు చేతుల్ని జాడిస్తూ, వేగంగా నడుస్తున్నా, ఆమె శ్రద్ధ కుండపై ఉన్నట్లే, ఎటువంటి అనిష్ట వాతావరణంలోనైనా మోక్షాభిలాషుల మనస్సు మౌనస్థితిలోనే ఉంటుందని ఆచార్యులు స్వానుభవాన్ని తెలియజేశారు.

ముక్తిసాధనకు కాయసిద్ధి అవసరమని ఆయన అభిప్రాయం. కాయసిద్ధి కలిగితే అనేక జన్మల సాధనను ఒక్క జన్మలోనే పూర్తిగావించి ముక్తి పొందవచ్చు. సిద్ధులతోబాటు కొంత కాలం జీవించిన తాయుమానవర్ 'సిద్ధగణం' అనే శీర్షికలోని పాటల్లో సిద్ధి, ముక్తి నొందిన మహాత్ములను పరిపరివిధాలుగా స్తుతించారు.

సిద్ధుల మహాయోగస్థితిని దర్శించిన ఆచార్యులు 'గాలిపటం వలె నిలకడలేని సంచలించే మనస్సును నిగ్రహించి భగవంతుడిపై క్షణమైనా నిలుపలేకపోతున్నానని వాపోయారు. మౌనంగా, కళ్ళుమూసుకొని, ప్రాణవాయువును స్తంభింపజేసి కళలు నిండిన చంద్రుణ్ణి స్పృశించేట్లు మూలాగ్నిని ప్రజ్వరిల్లజేసే విధానం బోధపడలేదని దుఃఖించారు. ఈ విలాపం ద్వారా ఆయన యోగసాధనను అర్థం చేసుకోవచ్చు.

మనోబుద్ధి చిత్తాహంకారాలనే అంతఃకరణాలను అదుపులో ఉంచుకొని మూలాధారం, స్వాధిష్ఠానం, మణిపూరకం, అనాహతం, విశుద్ధి, ఆజ్ఞాచక్రాలు ఆరింటిలో సూర్యాగ్నిచంద్రమండలాలపై ఆధిక్యతను పొందడం, కిణినాదం, కిణికిణినాదం, కంఠ, మృదంగ, వీణా, తాళనాదాలు మొదలైన దశవిధనాధాలు

మోగుతుండగా, పూర్ణచంద్రుడనే ఛత్రం ప్రకాశిస్తుండగా, వసంతకాలంలో విరబూసిన సుమగంధంలా, ఎదలో సంతోషం ఆవరించి ఉండగా, ఇంద్రాది దేవతలు మంగళాశాసనం పాడుతుండగా, ఎన్నటికీ నశ్వరం కాని శివరాజసిద్ధి కలవారై సింహాసనాన్ని అధిష్టించి సిద్ధులు కొలువున్నారని ఆచార్యులు వర్ణించారు.

యోగాభ్యాసం చేస్తూ నిష్ఠలో ఉన్నవారి ధ్యానానికి అనువైన మంత్రాలు ప్రణవం, పంచాక్షరి అని వక్కాణించారు.

శివరాజయోగమంటే యోగాన్ని కరణంగా చేపట్టి శివధ్యానం, సమాధి మొదలైన వాటిని ప్రయత్నించి సాధించడం అని అర్థం. భ్రుకుటి మధ్యనుంచి ఆరువేళ్ల నిడివి తర్వాత శిరస్సు మధ్యభాగంలో బ్రహ్మరంధ్రంలోని సహస్రదళకమలాన్ని, శివసూర్యునిచేత వికసింపజేసి, ఆ పద్మంలోని చంద్రమండలాన్ని మూలాగ్ని చేత ద్రవింపజేసి, స్రవించిన అమృతాన్ని సమస్త నాడులలోకి వ్యాపింపచేయడమే శివరాజయోగం. యోగపద్ధతుల్లో శివయోగం శ్రేష్ఠతమం.

ఎన్నటికీ అక్షయమైంది శివరాజయోగం. యోగులకైన భూమికలు ఏడు. అవి ఆరు ఆధారాలు (షట్చక్రాలు), బ్రహ్మరంధ్రం, శిరస్సు మధ్యనున్న బ్రహ్మరంధ్రం నుంచి పన్నెండు అంగుళాల తర్వాత ఉన్న బృహదాకాశంలో శివపరమాత్మను దర్శించి పరవశించ గలవారే గొప్ప యోగులు. సప్తభూమికలను దాటినవారు ద్వాదశాంత బట్టబయలులో భగవత్ సాక్షాత్కారం పొందుతారని ఆచార్యులు వివరించారు.

తాయుమానవర్ తమ గీతాలలో వివిధ ఆరాధనా పద్ధతుల్ని సులభ శైలిలో వర్ణించారు. ఆయన మహాభక్తకవి. నిష్కామ కర్మయోగి. శివరాజయోగి, అపార జ్ఞానసంపన్నులు.

* * *

## ఉపయుక్త గ్రంథాలు

1. తాయుమానవ స్వామిగళ్ – పాడల్ (సంపూర్ణగీతసంపుటి) (సం) – తి. సంబంధముదలియార్, అమెరికన్ ప్రింటింగ్ ప్రెస్, చెన్నై; – 1891.
2. తాయుమానవర్ వాయ్మ్వమ్ వయియుమ్ – ఆచార్య పొన్‌సౌరిరాజన్ పారినిలయమ్, చెన్నై – 600108; Oct. 1993.
3. తాయుమానవరుమ్ పట్టినత్తారుమ్ – పులవర్ సెందుడైముత్తు మాణిక్యవాచగర్ ప్రచురణ, చిదంబరం, 1983.
4. కబీర్‌దాసరుమ్, తాయుమానవరుమ్; స్టార్ ప్రచురణ, తిరువళ్ళిక్కేణి, చెన్నై; Feb.1978.
5. తిరుమందిరమ్ – తిరుమూలర్, వ్యాఖ్యానం – జ్ఞా. మాణిక్యవాచగర్, ఉమాప్రచురణలు, చెన్నై – 600001; August, 2011.
6. శ్రీ శివగీతా – శఫలమఞ్జరీవ్యాఖ్య – మేళ్ళచెఱ్వు వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, చీరాల; 24/05/2012.
7. యోగవాసిష్ఠం – రెండవసంపుటి – డా॥ సముద్రాల లక్ష్మణయ్య – తిరుపతి – 2016.
8. భగవద్గీత.
9. శ్రీవాణి (తిరుక్కుఱళ్ – నకు అనువాదం) డా॥ గాలి గుణశేఖర్, పుత్తూరు, 1996.